

# ప్రశాంతంగా 'జూబ్లీ' పోలింగ్



హైదరాబాద్ వార్త

**- చెదురుముదురు సంఘటనలు మినహా ప్రశాంతం**
**- కీలకంగా చివరి గంటల్లో పోలింగ్**
**-మొత్తం 48.43శాతం**



రహ్మత్‌నగర్‌లో బారులు తీరిన ఓటర్లు



దివ్యాంగుడిని వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది



**జూబ్లీహిల్స్, నవంబరు 11, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ చిన్నచిన్న సంఘటనలు మినహా ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ నేపథ్యంలో ఎన్నికల అధికారులు, పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. సాంకేతికతను వినియోగించి ఎన్నికలను నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మొత్తం 407 పోలింగ్ కేంద్రాలు 139 పోలింగ్ బూత్‌ల్లో ఇందుకు సంబంధించి అదికారులు ఏర్పాట్లు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 2014లో 50.18 శాతం, 2018లో 45.59 శాతం, 2023లో 47.58 పోలింగ్ శాతాలు నమోదయ్యాయి. కాగా ఈ సారి ఎన్నికల్లో మధ్యాహ్నం 3 గంటల వరకు 40.20 పోలింగ్ శాతం నమోదవ్వగా సాయంత్రం 5 గంటల వరకు 47.16 శాతం నమోదైంది. ఎల్లారెడ్డిగూడలోని ఓటింగ్ కేంద్రంలో ఎన్నికల పరిశీలకులు డీఐజీ ఓం ప్రకాశ్ తివారీ పరిశీలించారు.

**నన్నే బెదిరించారు.. మాగంటి సునీత**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ శైలిపై బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్ సంచలన వ్యాక్యలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరుగుతుందని, ఓటర్లను అధికార పార్టీకి చెందిన వారు భయపెడుతున్నారని ఆరోపించారు. పలు ప్రాంతాల్లో రౌడీషీటర్లు తిరుగుతున్నారని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు జూబ్లీహిల్స్‌లో ఏం పని అంటూ ఆమె ప్రశ్నించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బోరబండలో తమ కార్యకర్తలను కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ బెదిరించడమే కాకుండా దాడులకు పాల్పడ్డారన్నారు. దాడులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ఒక పోలింగ్ కేంద్రం వద్ద తననే బెదిరించారని ఆరోపించారు. 14వ తేది తరువాత వారి సంగతి చెబుతామని ఆమె స్పష్టం చేశారు. చాలా మేర పోలింగ్ కేంద్రాల వద్ద కాంగ్రెస్ పార్టీ బాహాటంగా డబ్బులు పంచుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

**డ్రోన్ల ద్వారా పరిశీలన..**

- జూబ్లీహిల్స్ పోలింగ్ సరళిని నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ పరిశీలించారు. డ్రోన్ల ద్వారా పోలింగ్ స్టేషన్ల వద్ద పరిస్థితిని ఆయన ఐసీసీసీలో ఏర్పాటుచేసిన కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రంలో పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోందని, దేశంలోనే తొలిసారి డ్రోన్ సాంకేతికత ద్వారా పోలింగ్ పర్యవేక్షిస్తున్నామని అన్నారు. మొత్తం 150 డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.

**జిరాక్సులతో పోలింగ్ కేంద్రాలకు..**

- షేక్‌పేట అజీజ్‌బాగ్ కాలనీ మౌంట్ మెర్సీ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఆధార్ కార్డు జిరాక్సులు తీసుకొచ్చిన మహిళలు ఓటు వేసేందుకు యత్నించారు. ఇది గుర్తించిన పోలీసులు వారిని అడ్డగించి తిప్పిపంపారు. ఓట్లు వేసేందుకు పదుల సంఖ్యలో మహిళలు ఇక్కడికి తరలివచ్చారు.

**ఉచిత ఆటోలు.. సహాయ కేంద్రాలు**

ఓటర్లను ఓటరు కేంద్రాల వరకు తీసుకెళ్లడానికి ఎన్నికల అధికారులు దాదాపు 400ల మేర ఉచిత ఆటోలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా రాజకీయ పార్టీలు సైతం వృద్ధులను, మహిళలను, దివ్యాంగులను ఓటరు కేంద్రాలకు తరలించేందుకు ఉచిత ఆటోల ను ఏర్పాటుచేశారు. మరోవైపు పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం వీల్‌ఛైర్లు, సహాయకులను, మెడిసిన్ డెస్కులను, ఓటరు సహాయ కేంద్రాలను ఏర్పాటుచేశారు. మరికొన్ని పోలింగ్ బూత్‌లలో కనీసంగా వీల్‌ఛైర్లు సైతం ఏర్పాటుచేయకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు సెల్‌ఫోన్ల డిపాజిట్ చేయడానికి ఓటరు సహాయ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఫోన్ తీసుకొని టోకెన్ ఇచ్చే విధానాన్ని ఏర్పాటుచేశారు. ఓటేసి వచ్చిన తరువాత వాటిని తిరిగి అప్పగించారు.

**ఆదర్శ పోలింగ్ కేంద్రాలు..**

పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగానే 12 పోలింగ్ కేంద్రాలను ఆదర్శ పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. మహిళా పోలింగ్ కేంద్రాల్లో మహిళా భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. యువత కోసం ఏర్పాటుచేసిన కేంద్రం లో యువతీ, యువకులు, దివ్యాంగుల కేంద్రంలో ఆ కేటగిరి ఉద్యోగులు విధులు నిర్వర్తించారు.

# ఓటు వేసిన ప్రముఖులు



ఓటు హక్కు వినియోగించుకోవడానికి వస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్



ఓటు హక్కు వినియోగించుకున్న నటుడు గోపచంద్



ఓటు హక్కు వినియోగించుకుంటున్న సినీ దర్శకుడు రాజమౌళి



ఓటు హక్కు వినియోగించుకున్న తణికెళ్ల భరణి

**జూబ్లీహిల్స్, నవంబరు 11, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితోపాటు నియోజకవర్గంలోని ప్రముకులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి హైస్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీనగర్‌కాలనీలోని మహిళా సమాజం పోలింగ్ కేంద్రంలో సినీనటుడు గోపిచంద్ ఓటు వేశారు. సినీ దర్శకుడు రాజమౌళి షేక్‌పేటలోని కేం బ్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన సతీమణి రమారాజమౌళి సైతం ఓటు వేశారు. ఇక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేయడానికి విచ్చేశారు. వెంకటగిరిలోని నాజర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన తన భార్య వర్షా యాదవ్, తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ తదితరులు ఓటు వేసిన వారిలో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్ నవోదయ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ నగర్ వెల్ఫేర్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి తన సతీమణితో కలిసి సోమాజీగూడ డివిజన్‌లోని నాగార్జుననగర్ కమ్యూనిటీ హాల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# అందెశ్రీకి అంతిమ వీడ్కోలు



లాలాపేట్‌లో అందెశ్రీ అంతిమ యాత్రలో పాల్గొన్న మంత్రులు సీతక్క,పొన్నం ప్రభాకర్, విహెచ్, డిప్యూటీ మేయర్ తధితరులు

**తార్నాక, నవంబర్ 11 ప్రభాతవార్త :** లాలాపేట్ నుంచి కవి అందెశ్రీ అంతిమ యాత్ర మంగళవారం ఉదయం కొనసాగింది. అంతకు ముందు ప్రజల సందర్శనార్థం లాలాపేట్ ప్రొ.జయశంకర్ స్టేడియంలో సోమవారం ఉంచిన అందెశ్రీ పార్థివ దేహం వద్ద పలువురు మంగళవారం కూడా నివాళులర్పించారు. కుటుంబ సభ్యుల సూచన మేరకు ఘట్కేసర్ ఎన్ఎఫ్సీ నగర్లో అందెశ్రీ అంత్యక్రియలు నిర్వహించే క్రమంలో అంతిమ యాత్ర లాలాపేట్ నుంచి తార్నాక మీదుగా ఘట్‌కేసర్ వైపు వెల్లింది. అయితే అందెశ్రీకి కడసారి నివాళులర్పించేందుకు పలువురు ప్రముఖులు లాలాపేటలోని ప్రొ.జయశంకర్ స్టేడియానికి తండోపతండాలుగా వెళ్లారు. ప్రొఫెసర్ జయశంకర్ ఇండోర్ స్టేడియం నుండి బయలుదేరిన అందెశ్రీ అంతిమ యాత్రలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ కోదండరాం,డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కవులు, కళాకారులు, రచయితలు, ప్రజలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పలువురు అందెశ్రీ పార్థివ దేహం పై పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# 13న వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డ్యూయల్ డిగ్రీ కోర్సులకు కౌన్సిలింగ్



**అత్తాపూర్ నవంబరు 11, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీలు సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ బీఎస్సి (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాల కోసం వాక్ఇన్‌కౌన్సిలింగ్ ను నిర్వహిస్తున్నట్లు పి జె టీ ఎ యూ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఎన్ ఆర్ ఐ /ఎన్ ఆర్ ఐ ప్రాయోజిత కోటా బీఎస్సి (ఆనర్స్) అగ్రికల్చర్, బి.టెక్ (ఫుడ్ టెక్నాలజీ), బి.టెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), బీఎస్సి (ఆనర్స్), కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో సీట్ల భర్తీకి వాక్ఇన్‌కౌన్సిలింగ్ జరగనుందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ రెండు కౌన్సిలింగ్ లు రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ నేచురల్ రిసోర్సెస్ అండ్ ఎన్విరాన్ మెంట్ (సి నరే) ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు విద్యాసాగర్ వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, వెబ్ సైట్ లో పేర్కొన్న రుసుముతో కౌన్సిలింగ్ కు హాజరుకావాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ లో చూడవచ్చని రిజిస్ట్రార్ తెలిపారు

# మియాపూర్ ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికారుల దృష్టి

**-హెచ్‌ఎండిఏ, హైడ్రా, రెవెన్యూ అధికారుల సంయుక్త పరిశీలన -అక్రమ బేస్‌మెంట్ల తొలగింపు - భవన నిర్మాణాల నిలుపుదల**



మియాపూర్ ప్రభుత్వ భూమిలో అక్రమంగా అనుమతి పొంది చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు



ప్రశాంత్‌నగర్‌లోని ప్రభుత్వ భూమి ఆక్రమణను తొలగిస్తున్న ద ృశ్యం

**సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 11 ప్రభాతవార్త**

మియాపూర్ ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఎట్టకేలకు అధికారులు ద ృష్టి సారించారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు స్థలాలుగా చూపిస్తూ అక్రమంగా అనుమతులు పొందిన విషయమై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. మియాపూర్ ప్రభుత్వ భూముల ఆక్రమణపై గతంలో 'ప్రభాతవార్త' పలు కథనాలను ప్రచురించిన సందర్భంలో నామమాత్రంగా అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న హెచ్‌ఎండిఏ, రెవెన్యూ అధికారులు ప్రస్తుతం హైడ్రా సహాయంతో పకడ్బందీగా రంగంలోకి దిగారు. ఇందులో భాగంగానే మంగళవారం హెచ్‌ఎండిఏ తాహశీల్దార్ దివ్యరెడ్డి నేత ృత్వంలో హైడ్రా, శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు కలిసి ప్రభుత్వ భూముల ఆక్రమణలను పరిశీలించారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు స్థలాలుగా చూపిస్తూ అక్రమంగా అనుమతులు పొంది చేపడుతున్న నిర్మాణాలను నిలుపుదల చేశారు. ఇదే సందర్భంలో మియాపూర్ సర్వే నెంబరు 100లోని ప్రశాంత్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని పెద్ద ఎత్తున ఆక్రమించి బేస్మెంట్లు నిర్మించిన విషయమై అధికారులకు ప్రభాతవార్త ప్రతినిధి పిర్యాదు చేయగా, వెంటనే అక్కడికి చేరుకున్న అధికారులు జెసిబి సహాయంతో అక్రమ బేస్మెంట్లను తొలగించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై 'మియాపూర్‌లో చెలరేగుతున్న భూ బకాసురులు' అనే శీర్షికన.. ఇక్కడ దాదాపు రెండువేల గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి బోరు వేసిన ఉదంతాన్ని ప్రభాతవార్త బట్టబయలు చేయగా, బాధ్యత గల అధికారులు స్థలాన్ని కాపాడడంలో విఫలమయ్యారు. దీంతో ప్రస్తుతం ఈ స్థలం చుట్టూ భారీ ఎత్తున బేస్మెంట్ సైతం వెలిసింది. దీనికి సమీపంలోనే మరో బేస్మెంట్ పుట్టుకు వచ్చిన ఉదంతాన్ని అధికారులకు తెలుపగా, వెంటనే స్పందించి వాటిని తొలగించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎండిఏ తాహశీల్దార్ దివ్యరెడ్డి, హైడ్రా ఇన్స్‌పెక్టర్ బాలగోపాల్ ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ మియాపూర్ సర్వే నెంబరు 101లో వచ్చిన అక్రమ నిర్మాణాన్ని ఇటీవలే తొలగించామని, మిగతా అక్రమాలపై కూడా ద ృష్టి సారించామన్నారు. ఈ భూములపై మరోమారు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములను ఆక్రమించి నూతనంగా పుట్టుకు వచ్చిన భవనాలను కూల్చివేస్తామని తెలిపారు. స్థానికంగా పార్కు ఆక్రమణపై తమకు పిర్యాదు అందిందని, ఈ విషయమై త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ప్రశాంత్‌నగర్ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెలసిన బేస్మెంట్లను తొలగిస్తుండగా కాలనీ అసోసియేషన్ నాయకులు వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ భూమిలో ఇప్పటి వరకు ఎన్నో నిర్మాణాలు వచ్చినా అడ్డుకోని అధికారులు ప్రస్తుతం కొనసాగుతున్న ఇక్కడి బేస్మెంట్లను తొలగించడం అన్యాయమని అన్నారు. శేరిలింగంపల్లి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, హెచ్‌ఎండిఏ సైట్ ఇంచార్జ్ శ్రీశైలం తదితర సిబ్బంది కూల్చివేత కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మూడున్నర కిలోల గంజాయి పట్టివేత

**-అవగాహన లేక పోలీసులు విద్యుత్ సిబ్బంది తోపులాటలు**

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** అక్రమంగా తరలిస్తున్న మూడున్నర కిలోల గంజాయిన పోలీసులు పట్టుకున్నారు. సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చైతన్యపురి ఇన్స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం..ఈనెల 9వ తేదీ రాత్రి విశ్వసనీయ సమాచారంతో నాగోల్ లోని నిమంత్రన్ ప్యాలెస్ సమీపంలో అక్రమంగా గంజాయిని రవాణ చేస్తున్న యాదాద్రి బువనగిరి జిల్లా గొల్లపల్లి కి చెందిన శ్యామల అరవింద్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అందులోకి తీసుకున్న అతని వద్ద నుంచి 3.542 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా తన కాలనీకి చెందిన వేణు తన నలుగురు స్నేహితులతో కలిసి తనని కిడ్నాప్ చేసి హయాత్ నగర్ లో తన స్నేహితుని ఇంట్లో అక్రమంగా నిర్బంధించినారని తెలుపటంతో చైతన్యపురి పోలీస్ స్టేషన్ లో అరవింద్ పై గంజాయి కేసు, వేణు, అతని నలుగురు స్నేహితులపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. కేసు నమోదు అనంతరం పోలీసుల అదుపులో ఉన్న అరవింద్ 10వ తేదీ రాత్రి 10 గంటల సమయములో పోలీసు వారితో మరికొంత గంజాయి తన స్నేహితుడు చంటి వద్ద ఉన్నదని తనను తీసుకెళ్తే అతనిని చూపించి గంజాయితో సహా పట్టిస్తానని సమాచారం ఇచ్చారు. అరవింద సమాచారం మేరకు అక్కడికి వెళ్ళిన పోలీసులు చంటి గంజాయితో పట్టుబడ్డాడు. ఈ విషయమై పంచనామ వ్రాయుటకు పంచులుగా ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు అవసరం ఉండటంతో రాత్రి సుమారు 10 గంటల సమయములో అందుబాటులో ఉన్న కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ దగ్గరలోని విద్యుత్ సబ్ స్టేషన్ కు లిఖిత పూర్వక లెటర్ పంపగా, అక్కడ సబ్ స్టేషన్ లో ఉన్న ఇద్దరు సిబ్బందికి పోలీసులు పంపిన లెటర్ పై అవగాహన లేకపోవటంతో పోలీసు వారితో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఒకరినొకరు తోసుకోవటం జరిగిందని తెలిపారు.

# నాక్ ఆధ్వర్యంలో సెంట్రింగ్ యూనిట్ శిక్షణ



శిక్షణలో పాల్గొన్నవారికి కిట్ అందజేస్తున్న నాక్ డైరెక్టర్ శాంతిశ్రీ తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 11,ప్రభాతవార్త:** సెంట్రింగ్ యూనిట్ శిక్షణను సద్వినియోగంచేసుకునే మహిళలకు వారి కుటుంబ సభ్యులకు ఇంద్రమ్మ ఇళ్ల నిర్మాణంలో మొదటి ప్రాధాన్యత ఉంటుందని నాక్ డైరెక్టర్ శాంతిశ్రీ అన్నారు. ఈమేరకు మంగళవారం హైటెక్‌సిటీ సమీపంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (నాక్) కేంద్రంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు 6 రోజుల శిక్షణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి డైరెక్టర్ శాంతిశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణలో పాల్గొన్నవారికి సలహాలు సూచనలు చేశారు. ఇక్కడ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ ఆయా విభాగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతామని ఆమె అన్నారు. ఈసందర్భంగా నాక్ డైరెక్టర్ శాంతి వారికి టీ షర్టు,హెల్మెట్ నోట్‌బుక్స్ అందజేశారు.

# సిఎం ప్రజావాణిని సందర్శించిన రాష్ట్ర అధికారుల బృందం

**బేగంపేట నవంబరు 11,ప్రభాతవార్త**



,సీఎం ప్రజావాణి ని సందర్శించి చిన్నారెడ్డిని కల్సిన రాష్ట్ర అధికారుల బృందం.

సీఎం ప్రజావాణి ని తెలంగాణా రాష్ట్ర వివిధ శాఖల అధికారుల బృందం మంగళవారం సందర్శించింది.మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో నిర్వహించిన సీఎం ప్రజావాణీ పనితీరును అధికారుల బృందం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు.సీఎం ప్రజావాణి సమస్యల పరిష్కారంలో అమలు చేస్తున్న తీరును స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతామని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా సీఎం ప్రజావాణీ ఇంచార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి తో అధికారులు భేటీ అయ్యారు.సీఎం ప్రజావాణీ అమలు తీరును,ప్రజల సమస్యల పరిష్కారంలో అనుసరిస్తున్న వైఖరిని అధికారులు చిన్నారెడ్డిని అడిగి తెల్సుకున్నారు.డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు సీఎం ప్రజావాణి ని సందర్శించి ఇక్కడి అనుభవాలతో తమ తమ జిల్లాల్లో కూడా ఇదే తరహా పద్ధతిని అనుసరిస్తామని అధికారులు పేర్కొన్నారు.సీఎం ప్రజావాణీ సమన్వయ అధికారులు రాకేష్‌రెడ్డి ,జగన్మోహన్ రెడ్డి,లక్ష్మీనారాయణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సృజనాత్మక ఆలోచనలతో సామాజిక సమస్యలను పరిష్కరించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ డాక్టర్ శైలా తల్లూరి తదితరులు

**చిక్కడపల్లి నవంబర్ 11 (ప్రభాతవార్త ):**
సృజనాత్మక ఆలోచనలతో సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రురల్ ఎడ్యుకేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ శైలా తల్లూరి అన్నారు. మంగళవారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ టెక్నాలజీ ప్యూర్ (పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రురల్ ఎడ్యుకేషన్ ) సంస్థ మధ్య ఒక అవగాహన ఒప్పంద కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంలో ప్యూర్ యువత క్లబ్ పరిచయ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో డా. శైలా తల్లూరి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తమ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఉగాండా, నైజీరియా, కెన్యా వంటి దేశాలతో పాటు యాభైకిపైగా చాప్టర్లు ఉన్న గ్లోబల్ నెట్వర్క్ గురించి వివరించారు. తమ క్లబ్ లో చేరి తమ సృజనాత్మక ఆలోచనలతో సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు "డిజైన్ థింకింగ్ " పద్ధతిని ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్ అవకాశాలు కూడా కల్పించారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావడానికి ఇది ఒక అద్భుత వేదికగా నిలుస్తుందన్నారు.

## బ్రాహ్మణ స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావాలి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ ఆచార్య కాకునూరి సూర్యనారాయణ మూర్తి,రాకేష్ తివారి

**చార్మినార్,నవంబరు 11 ప్రభాతవార్త :**
సామాజిక సేవా కార్యక్రమాలను విరివిరిగా నిర్వహించేందుకు బ్రాహ్మణులు,బ్రాహ్మణ స్వచ్ఛంద సంస్థలు మరింత ముందుకు రావలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రొఫెసర్ ఆచార్య కాకునూరి సూర్య నారాయణ మూర్తి పిలుపు నిచ్చారు.పాతబస్తీ ఉప్పుగూడలోని కన్యాకుబ్జ్ భవన్లో దక్షిణభారత కన్యాకుబ్జ్ బ్రాహ్మణ సభ ఆధ్వర్యంలో జరిగిన దీపావళీ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.దాదాపు నలభై ఐదు సంవత్సరాలు సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్న పదిహేను మంది బ్రాహ్మణులను ఘనంగా సత్కరించి,ప్రశంసా పత్రాలను అందజేసి వారి సేవలను ఆయన కొనియాడారు.ఈ సందర్భంగా ఆచార్య కాకునూరి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో ఇప్పటికే బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన అధికారులు,అనాధికారులు ఎంతో చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు.బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులు విద్య,వైద్య,ఆర్థిక రంగాలలో నిలదొక్కుకునేందుకు అన్ని విధాల సహాయాన్ని అందిచాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దక్షిణ భారత కన్యాకుబ్జ్ బ్రాహ్మణ సభ అధ్యక్షులు రామ్ కుమార్ తివారి,ఉపాధ్యక్షులు రాకేష్ తివారీ,ప్రధాన కార్యదర్శి విజయ్ పాల్ పాండే,సంయుక్త కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్,కోశాధికారి గో పాల్ శుక్లా పాల్గొన్నారు.అనంతరం సహ పంక్తి భోజనాలు జరిగాయి.

## పద్యనాటకోత్సవాలకు ఆదరణ తగ్గలేదు



లోకం కృష్ణయ్య ను సత్కరించించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 11 (ప్రభాతవార్త ):**
చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని సంగీత కళావేదిక లో సెర్వేశ్వర నాట్య మండలి ఆధ్వర్యంలో మంగళవారం పద్యనాటకోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ చైర్మన్ టి.రాంబాబు, అనిల్ చక్రవర్తి నిర్వహణలో జరిగింది. ఈ సందర్భంగా ఆరాధన సంస్థ అధినేత లోకం కృష్ణయ్యను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో భాగంగా శ్రీ కృష్ణరాయభారం, దుర్యోధన మాయ సభ, శ్రీ రామాంజనేయ యుద్ధం , శ్రీ కృష్ణ ఏకపాత్రాభినయం అద్భుతంగా నిర్వహించారు. కార్యక్రమంలో యక్షగాన కంఠీరవ పసుమర్తి శేషుబాబు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, విశ్రాంత విద్యుత్ శాఖ ఉన్నతాధికారి యు.విద్యాసాగర్ రావు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్పై దాడికి దిగిన గంజాయి బ్యాచ్

## తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిక

**కొంపల్లి, నవంబర్ 11, ప్రభాతవార్త**
ఆటో వెళ్లడానికి దారి ఇవ్వండి అంటూ అడిగిన ఆటో డ్రైవర్ను గంజాయి బ్యాచ్ చితకబాది తీవ్రంగా గాయపరిచింది. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట రాజీవ్ గృహకల్ప వద్ద ఈ సంఘటన సోమవారం రాత్రి సుమారు పదిన్నర గంటలకు చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రాజీవ్ గృహకల్పలోని 74 బ్లాకులో నివసిస్తూ ఆటో నడుపుకొని జీవనం గడిపే అరుణ్ నాయక్ సోమవారం రాత్రి తన డ్యూటీ ముగించుకొని ఆటో నడుపుకుంటూ రాజీవ్ గృహకల్పలోని తన బ్లాక్కు వెళ్లడానికి ప్రయత్నించాడు. రాజీవ్ గృహకల్పలో ఇటీవల ఒకవైపు నూతన సిసి రోడ్డు వేసి ఉండగా మరోవైపు మాత్రమే రాకపోకలకు అనువుగా ఉంది. దీంతో తన ఆటోను ముందుకు వెళ్లడానికి దారి ఇవ్వండి అంటూ అదే కాలనీ 80 బ్లాకులో నివసించే తిలక్ నాయక్ను అరుణ్ నాయక్ అడిగాడు. దీంతో తిలక్ నాయక్తో పాటు సుమారు మరో 15 మంది విపరీతంగా మద్యం, గంజాయి సేవించి ఉండడంతో ఆ మత్తులో అరుణ్ నాయక్పై తిరగబడి విపరీతంగా గాయపరిచారు. మత్తులో తిలక్ నాయక్ బ్యాచ్ ఏమి చేస్తున్నారో వాళ్లకే అర్థం కానిస్థితిలో అరుణ్ నాయక్ను తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయమై బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. అయితే బాచుపల్లి పోలీసులు విషయం దర్యాప్తులో ఉందని వివరాలు తర్వాత వెల్లడిస్తామంటూ స్పష్టం చేశారు. జరిగిన సంఘటన స్థానికంగా వాట్సాప్ గ్రూపులో విస్తృతంగా వైరల్ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. రాజీవ్ గృహకల్పలో జరుగుతున్న పరిణామాలపై బాచుపల్లి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే..!

## వైభవంగా హరేకృష్ణ స్వర్ణదేవాలయంలో 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు




బ్రహ్మోత్సవ పోస్టరును ఆవిష్కరిస్తున్న చంద్రదాస ప్రభుజీ

**రవీంద్రభారతి, నవంబరు 11 ప్రభాతవార్త** : హరేకృష్ణ స్వర్ణదేవాలయం హైదరాబాద్లో 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు నవంబరు 14 నుండి 19వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభుజీ తెలిపారు. ఈమేరకు బ్రహ్మోత్సవ ఆహ్వాన పోస్టర్, కార్యక్రమ వివరాలను చంద్రదాజ ప్రభుజీ ఈరోజు విడుదలచేసి వివరాలు వెల్లడించారు. ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు నవంబరు 14న శ్రీ లక్ష్మీనరసింహస్వామి మూలవరు, ఉత్సవమూర్తుల అభిషేకంతో ప్రారంభమౌతుంది. 17, 19 తేదీల్లో శ్రీ భూసమేత నరసింహస్వామి కళ్యాణోత్సవం, శ్రీ శ్రీరాధాగోవింద దేవుల 108 కలశ మహాచూర్ణాభిషేకం, మహాసంప్రోక్షణ వంటి ప్రధాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతీరోజూ దేవతా మూర్తులకు విశేషాలంకారాలు, పుష్పాలంకరణలు, నూతన వస్త్రాలు, ఆభరణాలతో ఆలకంకరించి హరినామ సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికశోభతో మార్మోగి విరాజిల్లుతుందని చెప్పారు. ఉత్సవ, వైభవ కార్యక్రమాలను వివరిస్తూ 14శుక్రవారం ఉదయం 5.15లకు శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలవర, ఉత్సవర అభిషేకం, రాత్రి 6.30లకు భూ వరాహపూజ, వైనతేయ ప్రతిష్ట, అకురార్పణ; 15 శనివారం ఉదయం 8.30లకు ధ్వజారోహణం, 10లకు ఉత్సవహోమం, సాయంత్రం 5లకు దేవత అవాహన, 6లకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఊంజలసేవ; 16 ఆదివారం ఉదయం 9.30లకు మహా సుదర్శనహోమం, రాత్రి 6లకు ఉత్సవహోమం, హనుమద్ వాహనసేవ, శ్రీరాధాగోవింద ఝూలన్ ఉత్సవం; 17సోమవారం ఉదయం 9.30లకు శ్రీరాధాగోవింద మూలవర ప్రతిష్ట, ఉత్సవహోమం, 11.30లకు చప్పన్ భోగ్సేవా, రాత్రి 6లకు ఉత్సవహోమం, 7లకు కార్తీక సోమవారం శ్రీ భూసమేత నరసింహస్వామి కళ్యాణోత్సవం; 18మంగళవారం ఉదయం 9.30లకు ఉత్సవహోమం, రాత్రి 6లకు ఉత్తసవహోమం, గరుడవాహనసేవ, శ్రీరాధాగోవింద ఝూలన్ ఉత్సవం; 19బుధవారం ఉదయం 8.30లకు ఉత్సవహోమం, 9.30లకు మహా పూర్ణాహుతి, 10.30లకు ఉత్సవార అభిషేకం, చక్రస్నానం, రాత్రి 6లకు దేవత ఉద్వాసనం, శ్రీపుష్పయాగం, 7లకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి శ్రీరాధాగోవింద, శ్రీ నితాయి గౌరాంగ, శ్రీల ప్రభుపాదుల వారికి మహాచూర్ణాభిషేకం, 9లకు మహాసంప్రోక్షణం నిర్వహించబడతాయని, భక్తుల సౌకర్యార్థం ప్రసాద పంపిణీ, వసతి, రవాణా వంటి అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయబడ్డాయని, అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించాలని కోరారు.

## తెలంగాణ సాయుధ పోరాటయోధుడు దేశిని చిన్నమల్లయ్య వర్ధంతి



మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్నమల్లయ్య, అందెశ్రీ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న బాలగొని బాల్రాజ్గౌడ్

**హైదరాబాద్ నవంబరు 11, ప్రభాతవార్త**
బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో ఫ్రంట్ ఛైర్మెన్ బాలగొని బాల్రాజ్గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, మాజీ ఎమ్మెల్యే దేశిని చిన్నమల్లయ్య 8వ వర్ధంతి కార్యక్రమం జరిగింది, మంగళవారం చిక్కడపల్లిలోని ఫ్రంట్ కార్యాలయంలో దేశని చిన్నమల్లయ్య, ప్రముఖ కవి గాయకుడు అందెశ్రీల చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ ఛైర్మన్ బాల్రాజ్గౌడ్, గౌడఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ ఆయిలీ వెంకన్నగౌడ్, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్.దుర్గయ్య గౌడ్, గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లికట్టే విజయ్కుమార్గౌడ్లు పాల్గొని మాట్లాడుతూ సాయుధ పోరాట యోధుడు, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సామాజిక ఉద్యమ నేత దేశిని చిన్నమల్లయ్య అన్నారు. గీత వృత్తి దారుల కోసం అహర్నిశలు శ్రమించిన పోరాటాల యోధుడని, ఆయన అడుగుజాడల్లో నడవాలని, ఆయన ఆశయాల బాటలో నడుస్తూ వారి ఆశయ సాధన కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా తెలంగాణ గేయ రచయిత అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటన్నారు. అందెశ్రీ,దేశిని చిన్న మల్లయ్యల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు వారి జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సింగం నాగేష్గౌడ్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు వెంకన్నగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డమీది విజయ్కుమార్గౌడ్, సీనియర్ బీసీ నాయకులు ఐలెని గౌడ్ బీసీ నాయకులు, నరేష్ ,అనిల్,సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొని దేశిని చిన్నమల్లయ్యకు ఘనంగా నివాళులు అర్పించారు.

## విద్యారంగానికి మౌలానా అబుల్ కలాం సేవలు మరువలేనివి

### -మండల విద్యాధికారి శంకర్ రాథోడ్



**అత్తాపూర్ నవంబరు 11, ప్రభాతవార్త :**
దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా పని చేసి విద్యారంగానికి బలమైన పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్కే దక్కుతుందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ పేర్కొన్నారు.మంగళవారం రాజేంద్రనగర్ మండలంలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సాంస్కృతిక కమిటీ చైర్మెన్ అల్లావలి ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ హాజరై మాట్లాడారు..మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆయన చేసిన సేవలను స్మరించుకోవాలని అన్నారు.ఆ మహనీయుడి జయంతినే జాతియ విదా దినోత్సవంగా నవంబరు 11 దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు.విద్యారంగంలో అబుల్ కలాం ఆజాద్ అమలు చేసిన వినూత్న సంస్కరణలు దేశంలో విద్యా అభివృద్ధికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. "ప్రతి ఒక్క బడుగు, బలహీన వర్గాల వారికి నాణ్యమైన విద్య అందాలని మోలానా అబుల్ కలాం ఆజాద్ కల అన్ని అది నిజం కావాలని సూచించారు.అనంతరం సమ్మేటివ్-1 పరీక్ష లో ప్రతిభ కనబర్చిన వారికి ఎంఈఓ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. అనంతరం (ఎండిఎం) మధ్యాహ్నభోజనం పరిశీలించి సంతృప్తిని వ్యక్త పరచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ శంకర్. ఉపాధ్యాయులు లత, ఆశాజ్యోతి, ముస్తాఫా మరియు విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## శామీర్పేట రైతు సేవా సహకార సంఘాన్ని ఆదర్శంగా తీసుకుంటాం

### -సందర్శించిన నాలుగు రాష్ట్రాల సహకార సంఘాల సిఇఓలు,సెక్రటరీలు

### -శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు సందర్శించిన వైనం



.శామీర్పేట సొసైటీ పనితీరును, అందిస్తున్న సేవలను వివిధ రాష్ట్రాల సహకార సంఘాల సిఇఒలకు, సెక్రటరీలకు వివరిస్తున్న స్థానిక సొసైటీ చైర్మన్ డా.ఆర్.మధుకర్రెడ్డి,పాల్గొన్న తదితరుల దృశ్యం

**శామీర్పేట, నవంబరు 11, ప్రభాతవార్త**
శామీర్పేట రైతు సేవా సహకార సంఘాన్ని ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సహకార సంఘాల సిఇఓలు,సెక్రటరీలు సందర్శించారు. మంగళవారం శామీర్పేట రైతు సేవా సహకార సంఘాన్ని నాబార్డు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు వారి ఆధ్వర్యంలో ఆయా రాష్ట్రాల సహకార సంఘాల సిఇఓలు, సెక్రటరీలు శిక్షణా కార్యక్రమంలో భాగంగ రెండవ రోజు వారు సందర్శించి సంఘం పనితీరును తెలుసుకున్నారు. శామీర్పేట సొసైటీ చైర్మన్ డా.ఆర్.మధుకర్రెడ్డి ఈ సహకార సంఘం నుంచి రైతులకు,సభ్యులకు అందుతున్న సేవలను ప్రయోజనాలను వారికి వివరించారు. రుణాలు, ఎరువులు, విత్తనాలు, ఫార్మ్రైస్ వన్ ప్రాజెక్ట్ ద్వారా మార్కెట్ లింకేజీ సౌకర్యం,డ్రోన్లు, స్ప్రేయర్లు అతి తక్కువ ధరలో టార్పాలిన్ల అమ్మకాలు సిఎస్సి సెంటర్ ద్వారా రైతులకు అందిస్తున్న ఆన్లైన్ సేవలను చైర్మన్ వివరించారు. ఆ తరువాత నాబార్డు పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ తమ రాష్ట్రంలో తమ సంఘం చేస్తున్న అభివృద్దిని, వ్యాపారాల గురించి వివరించారు. శామీర్పేట సంఘం ద్వారా అందుతున్న సేవలు, అభివృద్దిని చూసి వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సంఘాన్ని ఆదర్శంగ తీసుకుని తమ సంఘాల్లో ప్రవేశపెడుతామన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు నాబార్డు అధికారులు షీలా, సతీష్, యోగేష్, స్థానిక సంఘం వైస్చైర్మన్ ఎం. ఐలయ్యయాదవ్, డైరెక్టర్లు ముద్దం ప్రతాప్రెడ్డి, లక్ష్మిగారి నర్సింలుగౌడ్, ఆకుల చంద్రకళ, సంఘం సిఇఒ రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో ఛాంపియన్గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పురుషుల జట్టు




రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో ఛాంపియన్గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పురుషుల జట్టు రాణించి కప్ను అందుకున్న దృశ్యం

**శామీర్పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), నవంబరు 11, ప్రభాతవార్త**
రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో పోటీల్లో (ఖోఖో) ఛాంపియన్గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పురుషుల జట్టు రాణించి కప్ను కైవసం చేసుకుంది. అదే విధంగా మహిళల ఖోఖో పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి కప్లను అందుకుంది. మంగళవారం ఈ విషయాన్ని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.మంజుల, తోట జయప్రకాశ్ తెలియజేశారు. ఈ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఖోఖో క్రీడాకారుల కోచ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖోఖో సంఘం ఉపాధ్యక్షులు గుర్రం సత్తిరెడ్డి సంతోషం వ్యక్తం చేసి వారిని అభినందించారు. ఈ నెల 7వ తేదీ నుంచి 9వరకు పెద్దపల్లి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి 58వ సీనియర్ ఖోఖో పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పురుషుల జట్టు ప్రథమ స్థానంలో నిలిచి ఛాంపియన్గా నిలిచింది. ఈ టోర్నమెంట్ బెస్ట్ డిపెండర్ అవార్డుకు గున్న సుధీర్కుమార్, కొమరం భీమ్ అవార్డుకు జానకిరామ్ ఎంపికైనట్లు వారు తెలిపారు. అయితే మేడ్చల్ జిల్లా శామీర్పేట మండలం తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రౌండ్లో క్రీడాకారులకు 10రోజుల పాటు ఖోఖో శిక్షణా శిబిరం నిర్వహించటం వీరు పెద్దపల్లి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పురుషుల జట్టు ప్రథమ స్థానాన్ని దక్కించుకోవటం ఈ శిక్షణా విజయానికి నాంది పలికిందని వారు హర్షం వ్యక్తం చేశారు. అయితే ఈ జట్టులో తూంకుంట మున్సిపాల్టీకి చెందిన జైహింద్ ఖోఖో క్లబ్ నుంచి 8మంది క్రీడాకారులు పాల్గొని మొదటి స్థానంలో నిలిపినందుకు సీనియర్ క్రీడాకారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగ తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రెడ్డి, ఉమ్మడి శామీర్పేట మండల యుటిఎఫ్ అధ్యక్షులు తిరుమలేష్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖోఖో సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్యాదవ్, సీనియర్ క్రీడాకారులు రఘువర్ధన్గౌడ్, సందీప్గౌడ్, వినోద్కుమార్, సోమేశ్, సీనియర్ క్రీడాకారులు జట్టు సభ్యులను అభినందించారు.

## నాటకోత్సవాలతో రంగస్థలాన్ని ప్రోత్సహించడం హర్షదాయకం : డా. ఓలేటి పార్వతీశం



పెళ్ళిచూపులు హాస్యనాటికలో ఒక దృశ్యం

**నాంపల్లి, నవంబరు 11 ప్రభాతవార్త :** ఈరోజుల్లా సాంస్కృతిక సంస్థలు నాటకోత్సవాలను నిర్వహించడం చాలా అరుదని, అలాకాకుండా సుప్రసిద్ధ కిన్నెర సంస్థ నాటకోత్సవాలను నిర్వహిస్తూ రంగస్థలాన్ని ప్రోత్సహించడం హర్షదాయకమని సంస్థ, కార్యదర్శి మద్దాళి రఘురామ్ కళాసేవలను ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం ప్రశంసించారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్థ 48వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజులపాటు జరుపుతున్న కళాప్రదర్శనల్లో నాటకోత్సవాల రెండవరోజు మంగళవారం రాత్రి నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో ప్రముఖ రంగస్థల నటుడు, రూపశిల్పి డా. బి.ఎన్.ఎస్.కుమార్ సౌజన్యంతో ఎ.గురులక్ష్మి రచన, అయాచితుల రామకృష్ణ దర్శకత్వంలో అయాచితుల కల్చరల్ అండ్ వెల్ఫేర్ సొసైటి విజయవాడ వారిచే పెళ్ళిచూపులు హాస్య నాటిక; మైహోం అవతార్ సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు జె.రాధాకృష్ణ సౌజన్యంతో కె.నాగరాజు మూలకథ, డా. శ్రీజ సాదినేని నాటకీకరణ, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో రూపొందిన కొత్తభూతం నాటిక కళాంజలి, హైదరాబాద్ వారిచే అద్భుతంగా ప్రదర్శింపబడి నాటకప్రియులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా డా. పి.రఘు, డా. ఓలేటి పార్వతీశం, డా. బి.ఎన్.ఎస్.కుమార్, జె.రాధాకృష్ణ, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్, సుబ్బారావు, వెంకట్రావు, రామకోటేశ్వరరావు తదితరులు నేటి నాటిక ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు.

# ఓ.యూ సమగ్ర ప్రగతికి ప్రభుత్వం కృషి

### -వైస్ చాన్స్లర్ ప్రొ.కుమార్ మొలగరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విసి.ప్రొ.కుమార్ మొలగరం

**తార్నాక, నవంబర్ 11 ప్రభాతవార్త :**
ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమగ్ర ప్రగతి ప్రణాళికను రూపొందించే ఉద్దేశంతో ప్రిన్సిపల్స్, డీన్స్, డైరెక్టర్స్, విభాగాధిపతులతో మంగళవారం ఉపకులపతి ఆచార్య ప్రొఫెసర్ కుమార్ మొలుగరం భేటీ ఆయ్యారు. పరిపాలనా భవన్ లోని సెనెట్ హాల్లో అకడమిక్ అడ్మినిస్ట్రేటర్లను ఉద్దేశించి ప్రసంగించారు. గడిచిన ఏడాది కాలంలో విశ్వవిద్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలు, అకడమిక్ ఎక్సలెన్స్, పరిశోధనాభివృద్ధి, మౌళిక వసతుల కల్పన, నూతన ఆవిష్కరణలు ప్రాధాన్య అంశాలుగా విజయవంతంగా పనిచేశామని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలోని ఆచార్యులు, విద్యార్థులు, సిబ్బంది సహకారంతో గుణాత్మకమైన మార్పును నమోదు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో యూనివర్శిటీ అభివృద్ధికి బాటలు పడ్డాయన్నారు. ఇప్పటికే విశ్వవిద్యాలయ ప్రగతి కోసం వెయ్యి కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందేనని... దానికి సంబందించిన సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాదిలో ఎన్.ఐఆర్ఎఫ్, న్యాక్, క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్ తదితర ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సంస్థల లో మెరుగైన ర్యాంకు సాధించటానికి ప్రతి ఒక్కరూ తమ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తులుగా మనమంతా ఏమీ కాదన్న ప్రొఫెసర్ కుమార్. ఉస్మానియా అధ్యాపకులుగా కలిసికట్టుగా ఓ శక్తిగా ఉన్నామని గుర్తు చేశారు. వ్యక్తుల గొప్పతనం గురించి కాకుండా.... ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిష్టను పెంచే దిశగా పనిచేద్దామని కోరారు. ఓయూలోని వివిధ విభాగాలు, రంగాల్లో సాధించిన ప్రగతిపై సమాచారంతో కూడిన ప్రత్యేక బ్రోచర్ ను రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ఆచార్య జితెందర్ కుమార్ నాయక్, యూజీసీ వ్యవహారాల డీన్ ఆచార్య లావణ్య, జాయింట్ రిజిస్ట్రార్ నీరజ, ఎఫ్ఓ శ్రీనివాస్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, డీన్స్, డైరెక్టర్స్ నుంచి పరిపాలనకు అవసరమైన సూచనలు, సలహాలు స్వీకరించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలో బాధ్యతాయుతమైన పరిపాలనా పదవుల్లో ఉన్న ఆచార్యులందరూ పాల్గొన్నారు. ఉపకులపతిగా ఏడాది పూర్తి చేసుకున్న ప్రొఫెసర్ కుమార్ మొలుగరం కు పలువురు బోధన, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రగతికి విలువైన కాలాన్ని పెట్టుబడిగా పెట్టి శక్తివంచన లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఉపకులపతిగా ప్రొపెసర్ కుమార్ ఓయూ ప్రగతిలో తనదైన ముద్రవేశారన్నారు. ఓఎస్డీ ప్రొఫెసర్ జితెంద్ర కుమార్ నాయక్ మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా విజయవంతమైన ఫలితాలను సాధించామని అన్నారు. ప్రొఫెసర్ కుమార్ నాయకత్వంలో ఓయూను ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు.పలువురు ప్రిన్సిపల్స్, డీన్స్, డైరెక్టర్లు, పాలనాధికారులు ఈ సందర్భంగా తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

## ప్రజా కవి అందెశ్రీ మృతి సాహితీ లోకానికి తీరని లోటు

### ..త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా వి.ఎస్ జనార్ధన మూర్తి

**చిక్కడపల్లి నవంబర్ 11 (ప్రభాతవార్త ) :** తన అక్షరాలతో, పాటలతో కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాలను తాకిన ప్రజా కవి డా. అందెశ్రీ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా వి.ఎస్ జనార్ధన మూర్తి తెలిపారు. ఆయన రచించిన వేలాది కవితలు, పాటలు తెలంగాణ భాష, సంస్కృతులకు అద్దం పట్టాయి. నిత్య జీవితంలోని కష్టాలను, ప్రకృతి అందాలు, మానవ సంబంధాలను ఆయన కవిత్వం పట్టి చూపింది. ఆయన నవలలు మరియు గేయాలు తెలంగాణ పల్లె జీవితాన్ని, ఆకాంక్షలను బలంగా ప్రతిబింబించాయి. "జయ జయహే తెలంగాణ జనని జయ కేతనం" గీతం తెలంగాణ ప్రజల గుండె చప్పుడుగా మారింది. ఇది కేవలం ఒక పాట కాదు, దశాబ్దాల ఉద్యమ పతాక చిహ్నం. రాష్ట్ర ఆవిర్భావంలో ఆయన కలం పాత్ర చిరస్మరణీయమైంది. ఈ పాట తెలంగాణ రాష్ట్ర గీతంగా ఎంపిక కావడం ఆయన సాహిత్యానికి దక్కిన గొప్ప గౌరవం. ఆయన మన మధ్య లేకపోయిన అందెశ్రీ పాటలు మాత్రం శాశ్వతంగా ఉంటాయి. ఆయన మరణం తీరని లోటు, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడికి ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## డాక్టర్ అంబల్ల జనార్ధన్ రచించిన ప్రాణధార కథానిక సంపుటి ఆవిష్కరణ సభ

**చిక్కడపల్లి నవంబర్ 11 (ప్రభాతవార్త )**
మానస ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయగానసభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత డాక్టర్ అంబల్ల జనార్ధన్ రచించిన ప్రాణధార కథానిక సంపుటి ఆవిష్కరణ సభ 13న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కుందవరపు హనుమంతరావు కళావేదికలో ప్రముఖ రచయిత కూర చిదంబరం అధ్యక్షతన జరుగుతుందని నిర్వాహక సంస్థ స్థాపక కార్యదర్శి, ప్రముఖ కవి రఘుశ్రీ వివరించారు. ముఖ్యఅతిథిగా కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ పిల్లలమర్రి రాములు హాజరయి ఆవిష్కరిస్తారని, కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా వి.ఎస్ జనార్ధన మూర్తి, ప్రముఖ ఆశు కవి డాక్టర్ రాధశ్రీ తదితరులు పాల్గొంటారన్నారు.

## డా. శ్రీరంగాచార్యకి తెలుగు విశ్వవిద్యాలయ విశిష్ట పురస్కారం

**నాంపల్లి, నవంబరు 11 ప్రభాతవార్త :**
సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతీ సంవత్సరమిచ్చే విశిష్ట పురస్కారాన్ని ఈ సంవత్సరం ప్రముఖ సాహితీవేత్త, ఉత్తమ అధ్యాపకుడు, వక్త, గ్రంథపరిష్కర్తలు డా. శ్రీరంగాచార్యకు ప్రదానం చేయబోతున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. 1943లో నల్గొండ జిల్లా చందుపట్ల గ్రామంలో జన్మించిన శ్రీరంగాచార్య 1966 నుండి 2022వరకు మూడున్నర దశాబ్దాలు నాగర్కర్నూల్ జిల్లా పాలెం ఓరియంటల్ కళాశాలలో అధ్యాపకుడు, ప్రిన్సిపాల్గా పనిచేశారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న రంగాచార్య ఆరుతరాల మరింగంటి కవుల కృతులను వెలుగులోకి తెచ్చి వారికి ప్రాణ ప్రతిష్ట చేశారు. నల్గొండ జిల్లా కవులు, పండితులెందరినో లోకానికి పరిచయం చేశారు. ఒకతరం పండితులకు అంతేవాసిగా మెలిగి ఆ పాండితీ సుగంధాన్ని తర్వాతి తరానికి అందజేయడంలో కృతకృత్యులైన డా. శ్రీరంగాచార్యులకు విశ్వవిద్యాలయ ప్రతిష్టాత్మక విశిష్ట పురస్కారానికి ఎంపికచేసినట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం డిసెంబరు 2న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో శ్రీరంగాచార్యకు పురస్కారం, పురస్కారంతోపాటు లక్ష రూపాయల నగదు, ప్రశంసాపత్రం అతిథుల చేతులమీదుగా అందజేయడం జరుగుతుందని కోట్ల హనుమంతరావు వెల్లడించారు.

## దంపతులు మధ్య గొడవ

### -భర్త ఆత్మహత్య

**అల్వాల్,నవంబరు 11 ప్రభాతవార్త:** ప్రేమించి పెళ్ళి చేసుకున్న దంపతులకు ఒక కొడుకు ఉన్నాడు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన సుధీర్(28) జీవనోపాధి కోసం నగరానికి వచ్చి యాప్రాల్లో నివాసం ఉంటున్నారు. సుధీర్ మేస్త్రీ పని చేస్తుండగా భార్య ఇళ్ళల్లో పని చేస్తూ ఉంటుంది. దంపతులు మధ్య గత కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. బాధితుడు భార్యను పనికి పంపి అల్వాల్లో విబిఆర్ గార్డెన్స్ సమీపంలో నివాసం ఉంటున్న అక్క ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేని సమయమంలో సుధీర్ ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అపార్ట్మెంట్లో బంగారం చోరీ

**అత్తాపూర్ నవంబరు 11, ప్రభాతవార్త :** ఓ అపార్ట్మెంట్లో దొంగలు చొరబడి దోచుకెళ్లిన ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.స్థానికులు వివరాల ప్రకారం...రాజేంద్రనగర్ పరిధిలోని హైదర్ గూడ లో పిజెఆర్ అపార్ట్మెంట్ 4వ అంతస్తులో పలువురు దొంగలు చొరబడ్డి ఇంట్లో ఉన్న బంగారం దోచుకెళ్లారు.ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. 13 తులాల బంగారం అపహరణకు గురైనట్లు బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అన్నదానం

**శామీర్పేట, నవంబరు 11, ప్రభాతవార్త**
శామీర్పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. మంగళవారం శామీర్పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తరువాత అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమంకు దాతలు నల్లగొండ శంకర్గౌడ్, అనితదేవికగౌడ్, కుటుంబ సభ్యులు తన్విక,తనిశ్విని 11వేల రూపాయలు విరాళంగ అందజేశారు. అదే విధంగా యాస్కి శంకర్గౌడ్-లలిత దంపతులు కుటుంబ సభ్యులు 80కిలోల బియ్యంను అందజేశారు. బొడ్డుపల్లి సీనయ్య, మమత దంపతులు, భరద్వాజ్, యామిని, ముత్యాలమ్మ (నల్సార్కాలేజ్) 11వందల రూపాయలు అన్నదానంకు విరాళంగ అందజేసినట్లు శామీర్పేట గౌడ సంఘం సభ్యులు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి చేయూత నందించిన వారిని సభ్యులు సన్మానించి సత్కరించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు, పలువురు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయ అభివృద్ధిపై సమావేశం

**శామీర్పేట, నవంబరు 11, ప్రభాతవార్త**
తూంకుంట శ్రీమల్లిఖార్జునస్వామి (మల్లన్న) దేవాలయం అభివృద్ధి కోసం తూంకుంట యాదవ సంఘ సభ్యుల సమావేశం జరిగింది. మంగళవారం శామీర్పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ కేంద్రంలోని శ్రీమల్లన్న దేవాలయంలో యాదవ సంఘం సభ్యుల సమావేశం జరిగింది. దీనిలో శ్రీమల్లన్న దేవాలయ అభివృద్ధి కోసం, నిత్యపూజలు, కార్యక్రమాల నిర్వాహణ కోసం తూంకుంట గ్రామానికి చెందిన యాదవ సంఘం నుంచి 21మంది అభివృద్ధికి చేయూత నివ్వటానికి ముందుకు వచ్చినందున వారిని అభివృద్ధి కమిటీగా ఏర్పడనున్నారు. మాజీ ప్రజాప్రతినిధులను, సంఘం పెద్దలను పలువురిని తూంకుంట మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్యాదవ్ సన్మానించారు. ఆ తరువాత శ్రీమల్లన్న దేవాలయ పూర్తి కమిటీని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించినట్లు సంబంధితులు పేర్కొన్నారు. ముందుగా శ్రీమల్లిఖార్జునస్వామి (మల్లన్నను) యాదవ సంఘం సభ్యులు, సంఘ పెద్దలు దర్శించుకున్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచులు బి.దయాసాగర్యాదవ్, ఎద్దు నాగేశ్యాదవ్, యాదవ సంఘం పెద్దలు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నాణ్యత పెంచాలని సిపిఎం ధర్నా


ధర్నాలో పాల్గొన్న సిపిఎం నాయకులు

**నిజాంపేట్, నవంబర్ 11, ప్రభాతవార్త**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న రాజీవ్ గృహకల్పలో సీసీ రోడ్డు భద్రత కల్పించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ ప్లానింగ్ లేకుండా నాణ్యతలేని సిసి రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై విచారణ జరిపించి కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజీవ్ గృహకల్పలో 31 బ్లాక్ నుండి సాయి బాబా గుడి వరకు సీసీ రోడ్డు వేసి 4రోజులు గడుస్తున్న సీసీ రోడ్డుపై చుక్క నీళ్ళు కూడా పోయకుండా, నాణ్యత లేకుండా సిసి రోడ్డు వేస్తున్నారని, సీసీ రోడ్‌కి కావాల్సిన భద్రత ఇవ్వకుండా సీసీ రోడ్డుపై బండ్లు, 5000 లీటర్ నీళ్లు నిండి ఉన్న ట్యాక్టర్ సిసి రోడ్డుపైకెళ్ళి తిప్పుతున్నారని, దానివల్ల సీసీ రోడ్డు డ్యామేజ్ అవుతుందని అన్నారు. కాంట్రాక్టర్ ప్లానింగ్ లేకుండా నాణ్యతలేని సిసి రోడ్డు వేస్తూ ప్రజల డబ్బులను వృధా చేస్తున్నారని అన్నారు. నాణ్యత లేకుండా సీసీ రోడ్డు వేస్తున్న కాంట్రాక్టర్ లైసెన్‌ను వెంటనే రద్దు చేయాలని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్‌కి, రాష్ట్ర ప్రభుత్వానికి కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు పి. స్వామి, తిరుపతి, ఆకుకూర రెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం


విద్యార్థికి సహాయం అందజేస్తున్న దృశ్యం

**నిజాంపేట్, నవంబర్ 11, ప్రభాతవార్త**

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం దాతలు కొమరవెల్లి సందీప్, శ్వేతల సహకారంతో వైద్య విద్యార్థి బి. అర్జున్‌కి రూ.10000 ఆర్థిక సాయం అందించినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. కొమరవెల్లి సందీప్, శ్వేతల కుమారుడు కొమరవెల్లి ధృత్వ పుట్టినరోజు సందర్భంగా సంగారెడ్డి జిల్లా, ఝరాసంగ్రం మండలం, కుప్పనగర్‌కి చెందిన బి. అర్జున్ విద్యాభ్యాసమంత గవర్నమెంట్ రెసిడెన్షియల్‌లో చదివి, ఇంటి దగ్గరే ప్రిపరేషన్ అయి నీట్‌లో 428 మార్కులు తెచ్చుకుని, సిద్దిపేట గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు. తండ్రి 2018లో మరణించడంతో తల్లి కుటుంబ బాధ్యత తీసుకొని ముగ్గురు పిల్లల్ని చదివిస్తుంది. అందులో భాగంగానే అర్జున్‌కి ప్రతి సంవత్సరం లక్ష ఇరవై వేలు ఖర్చు అవుతుందని ఆర్థిక భారంతో ఉన్న కుటుంబాన్ని ఆసరాగా నిలబడిన సందీప్, శ్వేతలకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పవన్, కరుణాకర్ పాల్గొన్నారు.

## మన సంస్కృతి సంప్రదాయ కళలను రక్షిస్తున్న కిన్నెర

### : ఇన్‌కమ్‌టాక్స్ పూర్వ చీఫ్ కమిషనర్ డా.రఘు


సత్కారగ్రహీతలతో అతిథులు రఘు, బుజ్జి, సుబ్బరాయశర్మ, రఘురామ్, రామకోటేశ్వరరావు తదితరులు

**రవీంద్రభారతి, నవంబరు 11 ప్రభాతవార్త :** మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లోని కళలను రక్షించి ప్రోత్సహిస్తున్న కిన్నెర సంస్థ, కార్యదర్శి మద్దాళి రఘురామ్ అభినందనీయులని ఇన్‌కమ్‌టాక్స్ పూర్వ చీఫ్ కమిషనర్ డా. పి.రఘు అన్నారు. వీటన్నింటిని కాపాడుకోకపోతే కొన్ని అంతరించిపోయే ప్రమాదముందని చెప్పారు. ముఖ్యంగా యువతను కళలపట్ల ఆసక్తి కల్పించి వాటివైపు మళ్లించి ఆకర్షించేందుకు శాయశక్తులా కృషిచేయాలని, ఎక్కువ మంది ప్రేక్షకులు వచ్చేటట్లు ప్రయత్నించి ఆదరణ పొందేలా చూడాలని కళాసంస్థలకు సూచించారు. కిన్నెర 48వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో నాలుగురోజులపాటు నిర్వహిస్తున్న నాటకోత్సవాలను ముఖ్యఅతిథిగా పాల్గొన్న పి.రాఘు విశిష్ట అతిథులు బొప్పన నరసింహారావు (బుజ్జి), ఎం.రఘురామ్, డి.రామకోటేశ్వరరావు, సుబ్బరాయశర్మ, రాధాకృష్ణ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వై.కె.నాటక కళాపరిషత్ సౌజన్యంతో సుఖమంచి కోటేశ్వరరావు రచన దర్శకత్వంలో రూపొందిన మమ్మల్ని బ్రతకనివ్వండి నాటికను విజయవాడ సాంస్కృతిక సమితి, విజయవాడ వారిచే; మల్లాది రవికిరణ్ రచన, మల్లాది భాస్కర్ దర్శకత్వంలో రూపొందిన ఆవేశంలో ఆనందం హాస్యనాటిక మల్లాది క్రియేషన్స్, హైదరాబాద్ వారిచే అద్భుతంగా ప్రదర్శింపబడి విచ్చేసిన అశేష ప్రేక్షకులు, రంగస్థల ప్రియులను ఆకట్టుకుని ప్రశంసలందుకున్నాయి. చివరిగా అతిథుల చేతులమీదుగా సుఖమంచి కోటేశ్వరరావు, మల్లాది భాస్కర్‌లను ఘనంగా సత్కరించారు.

## అమిత్‌షా రాజీనామా చేయాలి : ఎఐవైఎఫ్


ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఏఐవైఎఫ్‌నేతలు

**ముషీరాబాద్, నవంబర్ 11, ప్రభాతవార్త:** ఢిల్లీ బాంబు పేలుడుకు నైతిక బాధ్యత వహిస్తూ అమిత్‌షా రాజీనామా చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హిమాయత్‌నగర్ వైజంక్షన్ వద్ద ఉగ్రవాదుల దిష్టి బొమ్మను వారు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కలూకలరి ధర్మేంద్రలు మాట్లాడుతూ ఢిల్లీలో శాంతి భద్రతలు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నియంత్రణలో ఉన్నాయని ప్రగల్భాలు పలికిని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశంలో శాంతి భద్రతల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, బీహార్ ఎన్నికలలో బిజీగా ఉన్నారని ఆరోపించారు. పెహెల్గామ్ దాడి తరువాత కూడా ఈ ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోలేదని విమర్శించారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో అంతమొదించాలని, ఉగ్రదాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు కోటి రూపాయలు, గాయపడిన వారికి 25లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు నెర్లకంటి శ్రీకాంత్, బిజ్జ శ్రీనివాసులు, శ్రీమాన్, సభ్యులు అనిల్‌కుమార్, శ్రావణ్, రమేష్, నర్సింహ, కిరణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణన్న తలపెట్టిన ఒబిసి సెమినార్‌ను విజయవంతం చేద్దాం

### బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎత్తారి బీంరాజ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎత్తారి బీంరాజ్

**ముషీరాబాద్, నవంబర్ 11, ప్రభాతవార్త:** రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణన్న డిసెంబర్ 10న ఢిల్లీలో తలపెట్టిన జాతీయ ఓబీసీ సెమినార్‌ను విజయవంతం చేద్దామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎత్తారి బీంరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం ముషీరాబాద్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు అన్ని రంగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీల సమస్య పరిష్కారానికి అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాలని కోరారు. రిజర్వేషన్లపై ప్రతిసారి వ్యతిరేక తీర్పులు వస్తున్నాయని, దీనికి రాజ్యాంగ బద్ధత కల్పించటమే శాశ్వత పరిష్కారమని అన్నారు. బీసీ రిజర్వేషన్ల రక్షణ కోసం ఏ రాష్ట్రంలో జరగని విధంగా మన రాష్ట్రంలో జరిపిన బంద్ బీసీల చైతన్యానికి నిదర్శనమన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డి6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని, గతంలో సుప్రీంకోర్టు అనేక మార్లు జనాభా లెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచవచ్చని తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అగ్రకులాలకు 10శాతం రిజర్వేషన్లు పెట్టినప్పుడు 50శాతం సీలింగ్ ఎత్తివేశారని, ఇప్పుడు చట్ట ప్రకారం, న్యాయప్రకారం రాజ్యాంగ పరమైన అవరోధాలు లేవు కాబట్టి సుప్రీంకోర్టులో కేసు కూడా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు పెంచటానికి కులాల వారీగా లెక్కలు తీశారు, అసెంబ్లీలో చట్టం చేశారు, కుల గణన చేపట్టాలని ప్రధాని మోదీ అంగీకరించటం ధైర్య సాహసాలతో కూడుకున్న అంశమని, బీసీలకు న్యాయం జరగాలంటే అది మోదీ ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు ఎం.రవి, బి.వెంకటయన, పి.స్వామి, ఎన్.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా పోచమ్మ తల్లి బోనాల వేడుకలు

### - భక్తులు, నాయకులతో కిటకిటలాడిన అమ్మవారి దేవాలయం


ఖానాపూర్ గ్రామంలో పోచమ్మ దేవాలయం పంచమ వార్షికోత్సవాలలో బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళల దృశ్యం


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు

**నార్సింగి, నవంబర్ 10 ప్రభాతవార్త :** మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు గండిపేట మండలంలోని ఖానాపూర్ గ్రామం పోచమ్మతల్లి భక్తిగీతాలపనతో మారుమ్రోగిపోయింది. పోచమ్మ ఆలయం పంచమ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. శివసత్తుల పూనకాలు, పోతురాజుల ఆహాకారాలు... పచ్చికుండకు పసుపు, కుంకుమ, వేపాకులతో అందంగా ముస్తాబు చేసిన బోనాలతో అమ్మవారి గీతాలాపన చేస్తూ ఆలయానికి వచ్చిన మహిళలతో ఖానాపూర్ ఆధ్యాత్మిక కేంద్రంగా మారిపోయింది. వందలాది మంది భక్తజనులతో అమ్మవారి ఆలయమంతా కిటకిటలాడింది. కోరికలు తీరిన వారు అమ్మవారికి భక్తితో ముడుపులు చెల్లించుకున్నారు. పుర ప్రముఖులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు అమ్మవారి పంచమ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ కొలిచిన వారికి కొంగు బంగారంగా నిలుస్తున్న పోచమ్మ తల్లికి ఏటేటా భక్తజనం పెరుగుతూ వస్తుందన్నారు. కాలంతో సమానంగా పరుగులు తీస్తున్న కంప్యూటర్ యుగంలో సైతం యువతరం ఆధ్యాత్మిక వేడుకల్లో భక్తి,శ్రద్ధలతో పాల్గొనడం శుభ పరిణామమన్నారు. ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని, నిత్యం దేవాలయ దర్శనం చేసుకునే వారు చురుగ్గా ఉంటారని, ఏ కార్యంను ప్రారంభించినా విజయం లభిస్తుందన్నారు. ఈ వేడుకల్లో సీనియర్ నాయకులు రామేశ్వరం నర్సిహ్మ, పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కొండకళ్ల రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ టి.కృష్ణ, మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్ యాదవ్, దశరథ్ యాదవ్, వినోద్ కుమార్, దుద్దాల రాజు, మన్నె సురేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ బెల్ట్ షాప్‌ల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలి : బిక్షపతి యాదవ్


: ఎస్ఐ శ్రీనివాస్‌కి వినతిపత్రం సమర్పిస్తున్న బిక్షపతి యాదవ్

**నిజాంపేట్, నవంబర్ 11, ప్రభాతవార్త**

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ కాలనీలలో పెరుగుతున్న గంజాయి, డ్రగ్స్ బెల్ట్ షాప్‌ల నియంత్రణ కొరకు తగిన చర్యలు చేపట్టాలని నిజాంపేట అధ్యక్షులు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో బాచుపల్లి పోలీస్ స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ శ్రీనివాస్‌కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని నిజాంపేటలోని వివిధ కాలనీలలో సాయంత్రం నుండి రాత్రి సమయంలో వివిధ కాలనీలలో అక్రమంగా వెలిసిన బెల్ట్ షాపుల వద్ద నుండి మద్యం సేవించడమే కాకుండా ఈ మధ్యకాలంలో గంజాయి, డ్రగ్స్ కూడా విచ్చలవిడిగా విక్రయాలు పెరుగుతూ ఉన్నాయి అనడానికి ఈ మధ్యకాలంలో జరుగుతున్న వివిధ సంఘటనలే నిదర్శనమని ఈ మధ్య కాలంలోనే గంజాయి మత్తులో యువత జగద్గిరిగుట్టలో హత్యలకు కూడా పాల్పడుతున్నారన్న విషయం మనందరికీ తెలిసిందని అన్నారు. గంజాయి డ్రగ్స్ తాగిన మత్తులో యువకులు చేస్తున్న దారుణాల వల్ల ఇతరులు ప్రయోభ్యాంతులకు గురి అవుతున్నారని, ఇలాంటి డ్రగ్స్, గంజాయి విష సంస్కృతికి యువత బానిసలు కాకుండా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ కాలనీలలో అక్రమంగా అమ్ముతున్న బెల్ట్ షాప్‌ల పైన అదే విధంగా డ్రగ్స్ గంజాయి అమ్ముతున్న వారిని వెంటనే గుర్తించి వారి పైన తగిన చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ సచిన్, సెక్రెటరీ సురేష్, అమరేందర్, త్రినాథ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సాలార్‌జంగ్ మ్యూజియంలో 14 నుంచి బాలల వారోత్సవాలు

**చార్మినార్, నవంబరు 11 ప్రభాతవార్త :** సాలార్‌జంగ్ మ్యూజియంలో నవంబరు నెల 14 నుంచి 20వ తేదీ వరకు బాలల వారోత్సవాలను నిర్వహించనున్నామని మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ ఆర్.బి.నాయక్ తెలిపారు. బాలల వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులను జూనియర్, సీనియర్‌లుగా విభజించి వ్యాచరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలను జరుపుతున్నామని ఆయన తెలియజేశారు. నవంబరు నెల 17వ తేదీ సోమవారం ఉదయం 11 నుంచి1 గంట వరకు వ్యాస రచన (తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో) పోటీ, 18వ తేదీన మంగళవారం ఉదయం11 నుంచి 1 గంట వరకు వక్తృత్వం (తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో) పోటీ, 19వ తేదీ బుధవారం 11 నుంచి 1 గంట వరకు డ్రాయింగ్ (తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో) పోటీ జరుగుతుందని ఆయన తెలిపారు. 6,7,8 తరగతి విద్యార్థులు జూనియర్లుగా, 9,10వ తరగతి విద్యార్థులను సీనియర్లుగా విభజించామని ఆయన తెలియజేశారు. పోటీలలో పాల్గొనదలచే విద్యార్థులు 8095414812 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలనిసాలార్‌జంగ్ మ్యూజియం క్యూరేటర్ ఆర్.బి.నాయక్ తెలిపారు.

## జన కవి అందెశ్రీ మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటు

### -సర్వ జన వికాస్ మంచ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్

**చిక్కడపల్లి నవంబర్ 11 (ప్రభాతవార్త ) :** తెలంగాణ ఉద్యమ కాలంలో అందెశ్రీ రచనలు ప్రజల్లో ఉద్యమ జ్యోతి వెలిగించాయని సర్వ జన వికాస్ మంచ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్ వివరించారు. తెలంగాణ ప్రజల ఆశయాలను ప్రతిబింబిస్తూ ఆయన రాసిన "జయ జయ హె తెలంగాణ, జనని జయకేతనం" పాటను తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర గీతంగా స్వీకరించిందని , ఇది ఆయనకు అమరత్వాన్ని ఇచ్చిన గొప్ప ఘట్టం అని అన్నారు. తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక రంగాలకు అపూర్వమైన సేవలందించిన అందెశ్రీ మరణం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందిన అందెశ్రీ ఆయన సాహిత్య, సాంఘిక కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆయన అకాల మృతి పట్ల ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు సంతాపాన్ని తెలిపారు.

## లూయిస్ బ్రెల్ భవన్‌లో యాంటీ కరప్షన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


నూతన కమిటీ సభ్యులు

**జీడిమెట్ల, నవంబర్ 11, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ లూయిస్ బ్రెన్ భవన్‌లో యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర కొత్త కమిటీ ఏర్పాటుతో పాటు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నేషనల్ డైరెక్టర్ ఉప్పు సంజీవ రావు, నేషనల్ డిప్యూటీ డైరెక్టర్రె, రాజశేఖర్ రెడ్డి, తెలంగాణ చైర్మన్, ఇన్నారెడ్డి వైస్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, స్టేట్ సెక్రటరీ, కళ్యాణ్ రాజు, స్టేట్ కోఆర్డినేటర్స్, స్టేట్ ఇంచార్జ్‌లు, జిల్లా ప్రెసిడెంట్లు, జిల్లా కోఆర్డినేటర్లు సంస్థకు చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు. నూతన కమిటీ సభ్యులకు అధికారికంగా నియామకపత్రాలు అందజేసిన అనంతరం, వారు తమ బాధ్యతలను స్వీకరిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రజల్లో అవినీతి వ్యతిరేక భావజాలాన్ని పెంచి, పారదర్శక పాలన కోసం పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వక్తలు ప్రస్తావించారు. నేషనల్ డైరెక్టర్ ఉప్పు సంజీవరావు మాట్లాడుతూ అవినీతి దేశ అభివృద్ధికి అతిపెద్ద అడ్డంకి, ప్రజాస్వామ్య బలహీనతకు కారణమయ్యే ఈ అవినీతిని నిర్మూలించడం కోసం ప్రతి పౌరుడు ముందుకు రావాలి. యువతలో నైతిక విలువలను పెంచి, అవినీతి రహిత తెలంగాణ నిర్మాణం మా ప్రధాన లక్ష్యం. ప్రతి మండలం, జిల్లా స్థాయిలో యాంటి కరప్షన్ కార్యకర్తలను ఏర్పాటు చేసి, అవగాహన కార్యక్రమాలు చేపడతాం" అని తెలిపారు. ఇక రాష్ట్ర చైర్మన్ మాట్లాడుతూ సమాజంలో అవినీతి ఎదిరించేందుకు సొంత ధైర్యం, సొంత నిబద్ధత అవసరం. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మా కర్తవ్యమని" అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ సెక్రటరీ మాట్లాడుతూ అవినీతి నిరోధక చట్టాలపై అవగాహన పెంచడం, ప్రభుత్వ సేవలలో పారదర్శకతను సాధించడం, ప్రజా సమస్యలను న్యాయబద్ధంగా పరిష్కరించడం వంటి అంశాలపై దృష్టిపెట్టనున్నట్లు వెల్లడించారు. నూతన కమిటీ సభ్యులు సంస్థ లక్ష్యాలను పాటిస్తూ బాధ్యతగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు, నాయకులు ఒకరికొకరు అభినందనలు తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యుత్ కార్మికులపై పోలీసుల దాష్టికం

-గంజాయి కేసులో సాక్ష్యంగా ఉండాలని ఒత్తిడి
-ఒప్పుకోకపోవడంతో వారిని లాకెళ్లే ప్రయత్నం
-కారకులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిసిపికి ఉన్నతాధికారుల ఫిర్యాదు


ఎల్బీనగర్ డిసిపి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ కార్మికులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 11 ప్రభాతవార్త:** సంబంధం లేని విషయంలో సాక్షులుగా ఉండాలంటూ విద్యుత్ కార్మికులపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులైన కొత్తపేట సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ అసిస్టెంట్ లైన్ మ్యాన్ ఎడ్ల జగన్, ఆర్టిసం శరత్‌కుమార్‌రెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 10వ తేదీ సోమవారం రాత్రి 10 గంటల సమయంలో చైతన్యపురి డివిజన్ పరిధిలోని కొత్తపేట విద్యుత్ కార్యాలయానికి చైతన్యపురి పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహించే బాల్‌రాజు, దశరథ సివిల్ డ్రెస్‌లో ఉన్న మరొక పోలీస్ సిబ్బంది వచ్చి డ్రగ్స్, గంజాయి దిరికాయని అందుకు మీరు సాక్షులుగా ఉండాలని చెప్పారు. అందుకు జగన్, శరత్‌కుమార్‌రెడ్డి నిరాకరించడంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అయితే ఎలాగైనా సాక్ష్యం పెట్టాలంటూ పోలీసులు వారిపై ఒత్తిడి చేయడంలో భాగంగా దుర్భాషలాడి లాక్కెళ్ళే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువురు మధ్య పెనుగులాట జరిగింది. ఈ దృశ్యాలను చిత్రీకరించడంతో సోషల్ మీడియాలో పెద్దఎత్తున వైరల్గా మారింది. విద్యుత్ కార్యాలయానికి వచ్చిన పోలీసులు విద్యుత్ సిబ్బందిపై దాడి చేస్తున్న వ్యవహారం పూర్తిగా కావడం చర్చనీ అంశంగా మారింది. డ్రగ్స్, గంజాయి దిరికిన కేసులో ఎట్టి పరిస్థితిలో తాము సాక్షులుగా ఉండమని ఆ కేసుకు సంబంధించి మాకు ఎటువంటి సంబంధం లేదని ఎంత చెప్పినా వినకుండా పోలీసులు చాలా రకాలుగా ఒత్తిడి తీసుకువచ్చారు. ఎంత ఒత్తిడి తీసుకువచ్చిన జగన్, శరత్‌కుమార్‌రెడ్డి ససేమిరా అంటూ పోలీసుల విన్నపాన్ని వ్యతిరేకించారు. ఇలా చాలాసేపు వారి మధ్య జరిగిన గొడవకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పోలీసుల మాట వినకపోవడంతో జగన్, శరత్‌కుమార్‌రెడ్డిలకు చెందిన సెల్ఫోన్లను పోలీసులు లాక్కొని వెళ్లిపోయారు. అనంతరం విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను బాధితులు వివరించారు. మంగళవారం ఉదయం విద్యుత్‌శాఖ ఎస్సీ, డీఈ, ఏఈ ఇతర అధికారులు, సిబ్బంది పెద్దఎత్తున ఎల్బీనగర్ డిసిపి వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. అనవసరంగా విద్యుత్‌శాఖ సిబ్బందిపై దాడికి పాల్పడి విచక్షణారహితంగా వ్యవహరించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులు డీసీపీకి వినతి పత్రం అందజేశారు. కారకులైన వారిపై కేసు నమోదు చేసి భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు డీసీపీని కోరారు. కాగా పోలీసులు మాత్రం ఈ విషయానికి సంబంధించి ఎటువంటి వివరాలను వెల్లడించడం లేదు. ఈ సంఘటనకు సంబంధించి విచారణ తప్పనిసరిగా చేపడతామని డిసిపి హామీ ఇచ్చినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

**విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా....**

చైతన్యపురి పోలీసులు అకారణంగా విద్యుత్‌శాఖ సిబ్బందిపై దాడి చేయడం అమానుషమని విద్యుత్‌శాఖ కార్మికులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని విద్యుత్ కార్యాలయం వద్ద మంగళవారం విద్యుత్ కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంబంధం లేని విషయంలో పోలీసులు ఒత్తిడి తీసుకువచ్చి దాడికి పాల్గొనడం అమానుషమన్నారు. కారకులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రచయిత అందెశ్రీకి ఘననివాళి


అందెశ్రీ అంతమయాత్రలో అరసం కార్యవర్గం

**నాంపల్లి, నవంబరు 11 ప్రభాతవార్త :** గుండెపోటుతో అస్తమించిన ప్రసిద్ధ రచయిత అందెశ్రీకి అరసం ఘననివాళులర్పించింది. మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు అంటూ మన వ్యవస్థలోని అస్తవ్యస్తాల్ని ఎండగట్టిన, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రచించిన అభ్యుదయ వాగ్గేయకారుడు డా. అందెశ్రీ అంతిమయాత్రలో తెలంగాణ రాష్ట్ర అరసం ఉపాధ్యక్షుడు బొమ్మగాని నాగభూషణం, ప్రధాన కార్యదర్శి డా. రాపోలు సుదర్శన్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.వి.ఎల్, ఐస్సో కార్య వర్గ సభ్యులు పాల్గొని అంజలి ఘటించారు.


IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE: SANGAREDDY DISTRICT, AT: SANGAREDDY
I.A.No.759 of 2025
in
I.A.No.762 of 2025
in
I.A.No.764 of 2025
in
I.A.No.2522 of 2024
in
I.A.No.760 of 2025
in
I.A.No.761 of 2025
in
I.A.No.763 of 2025
in
O.S.No. 183 of 2024
BETWEEN
Ramireddy Surya Chandra Reddy
...Petitioner/Petitioner/Plaintiff
And
1) Mohammed Moinuddin S/o Late Mohammed Abdul Hussain (died)
...Respondent No.1/Respondent/defendant
2) Mohd.Moizuddin S/o late Mohammed Moinuddin
3) Mohd.Mohiuddin S/o late Mohammed Moinuddin
4) Sahira Begum D/o late Mohammed Moinuddin
...Respondents No.2 to 4/Proposed Respondents. No.2 to 4/ Proposed Defendants No.2 to 4
To
1) Mohd.Moizuddin S/o late Mohammed Moinuddin Aged about 42 years, Occ: Not Known, R/o H.No.8-2-676/1/B/35/1, Sri Ram Nagar, Banjara Hills, Road No.12, Hyderabad – 500034
2) Mohd.Mohiuddin S/o late Mohammed Moinuddin Aged about 40 years, Occ: Not Known, R/o H.No.8-2-676/1/B/35/1, Sri Ram Nagar, Banjara Hills, Road No.12, Hyderabad – 500034
3) Sahira Begum D/o late Mohammed Moinuddin Aged about 35 years, Occ: Not Known, R/o H.No.8-2-676/1/B/35/1, Sri Ram Nagar, Banjara Hills, Road No.12, Hyderabad – 500034
...Respondents No.2 to 4/Proposed Respondents. No.2 to 4/ Proposed Defendants No.2 to 4
Whereas the above plaintiff filed suit OS No.183 of 2024 against Mohammed Moinuddin for specific performance of an agreement of sale. The above suit is posted to 25-11-2025 for your appearance in I.A.No.759 of 2025, I.A.No.762 of 2025, I.A.No.764 of 2025, in I.A.No.2522 of 2024 and in IA No.760 of 2025, IA No.761 of 2025, IA No.763 of 2025 in OS No.183 of 2024. You are hereby summoned to appear either in person or through your pleader with your defense if any at 10.30 A.M., on 25.11.2025 before the Hon'ble Court of Principal District Judge, Sangareddy District at Sangareddy, failing which the suit will be heard and determined exparte.
"BY ORDER OF THE COURT"
COUNSEL FOR PLAINTIFF
A. Manohar Reddy, Advocate
Plot No.252, H.No.7-1-252 First Floor Aditya Sakshi, HUDA Colony Nallagandla, Hyderabad- 500 019. Mobile: +91 9393366440.

NOTICE
IN THE COURT OF THE HONOURABLE XIX SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT. SECUNDERABAD.
O.S.NO. 167 OF 2025
Between:
G.A.Christopher son of late GG Alfred, Aged about 70 years, occ: Rtd Employee R/o F.No.204, Casarosa Apartments, Walker town Padmaraonagar, Secunderabad.
...Plaintiff
And
K.Sujatha Charles and others
...Defendants
To:
1) Deborah Krupalini d/o late K.Charles Sukumar Aged 41 years, occ: Homemaker r/o 39, Kalyan Sulochana Gardens, Yapral, Hyderabad
..Defendant No.2
2) K.Jesse Susheel Kumar s/o Late K.Charles Sukumar Aged about 38 years, occ: Pvt. Employee r/o Plot No.35 Sai Sagar Enclave, Manasarovar Heights, Hashmathpet Hyderabad.
..Defendant No.3
3) K.Manjula Elizabeth d/o late K.C. Krupaiah Aged 62 years, occ: Homemaker r/o Plot No.35 Sai Sagar Enclave, Manasarovar Heights, Hashmathpet Hyderabad.
..Defendant No.5
4)Smt. Kathlena T.d/o late GG Alfred aged 77 years Occ: Homemaker r/o 3-6-188/21, Plot No.54 Himayathnagar, Hyderabad
..Defendant No.6
Please take notice that the Plaintiff above named filed the above suit against the Defendants in the above suit for Partition and for separate possession in respect of suit schedule property. The said suit stands posted to 12.12.2025 for your appearance at 10.30 a.m. either in person or through your Advocate. If you fail to appear before the said court on the date and time mentioned above, the matter will be heard and decided exparte.
Schedule of property: All that the Premises Bearing Residential H.No.1-11-234,admeasuring 156 Sq. Yards or 130.4Sq. Meters, having its built-up area of 700 Sq. Feet, situated at Shyamlal Building, Begumpet, Hyderabad, bounded on the: North by: HouseNo.1-11-83. South by: House No. 1-11-235. East by: Srivasthav Apartments. West by: 30'-0" wide road and Stephens School.
(By order of the Court)
Sd/-J.Susheel Kumar
P.Shruti Laya
K.Karthik Reddy
Advocates
Off:1A, Susheel Residents Apts. Near Basant Sahney Hospital, West Marredpally, Secunderabad-500026
Cell No. 9849699935
Counsels for Plaintiff

NOTICE
IN THE COURT OF THE I ADDL DISTRICT JUDGE, RR DISTRICT, AT:: L.B. NAGAR
L.A O.P. No.792 of 2007
Between:
1. The Land Acquisition Officer & Spl. Dy. Collector, L.A. (Ind.)
...Referring Officer
And
1. Dr. A.Potrika & Others
...Claimants
To
1. K.Shivakumar S/o Pochaiah Age: Major Occ: Business R/o Hyderabad.
2. Samala Jangamma W/o Not Known Age: Major Occ: Business R/o Hyderabad.
3. Krishna S/o Not Known Age: Major Occ: Business R/o Hyderabad
....Claimant No. 2,12&15
Please take notice that, the Referring Officer referred the above op Under Section 30 of L.A. Act in Sy. No. 550,553&555 admeasuring Ac-45-19gts, of Turkayamjal Village, erstwhile Hayathnagar Mandal & presently Abdullapurmet Mandal of Ranga Reddy District The Claimant No. 2,12 &15 in the above petition several times summons were issued and thereafter the Hon'ble Court has ordered to substitute the services in the Newspaper. Now the matter stands posted on 19.11.2025 at 10.30 a.m., for your appearance either in person or through an Advocate, failing which the matter would be decided as per law.
//BY ORDER OF THE COURT\\
B. Thirmal Reddy,
Government Pleader (TS/898/1991)
Door No. 8-2-692, Flat No. 202-A, 1st Floor, La Paloma Caves, Road No. 12, Banjara Hills, Hyderabad 500 034.
Ph. No. 9246529363
Counsel for Referring Officer

IN THE HON'BLE COURT OF THE V SENIOR CIVIL JUDGE, CITI CIVIL COURTS AT HYDERABAD
O.S. No. 586 OF 2024
Between:
State Bank of India, Himayathnagar Branch, Hyderabad.
... Plaintiff
And
Tasleem Sultana
... Defendant
To
Tasleem Sultana, W/o. Late. Shaik Saleem, Aged: Major, Occ: Housewife, H. No. 8-3-228/678/ 1430, Yousufguda, Sree Ramnagar, Hyderabad - 500045.
Please take notice that as you are evading to taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate at 10-30 AM on 09-12-2025 in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.
SMT. RAPAKA ARUNA
B.A, B.L.,
Advocate
11-78, Flat No.203, Sri Sai Manssion, Pragathinagar, Gaddiannaram,Hyderabad–60.
Cell: 9030617991

IN THE COURT OF HON'BLE Ist ADDL JUNIOR CIVIL JUDGE-CUM-VIII ADDITIONAL JUDICIAL MEGISTRAT OF FIRST CLASS AT: MEDCHAL ATHEVELLY
O.S.No.693 of 2025
BETWEEN:
Smt. Parabathulla Aruna& othrs
...Plaintiff
And
1. The Tahsildar, Bachupally Mandal, Medchal Malkajgiri District, Telangana.
2. All Concern
... Defendants
WHEREAS the above-named Petitioner/ Plaintiff has made as application to this Court Under Order VII Rule 1 & 2.
You are i.e., D2 hereby wanted to appear in this court in person or by a pleader duly instructed on the 1stday of December 2025 at 10:30 O' Clock in the forenoon to show cause of against the application, failing which the said application will be heard and determined experty.
(BY ORDER OF THE HON'BLE COURT)
M/s M.RAVINDER REDDY
PALLE RAJASHEKHAR
K.RAMESH GOUD
ADVOCATES
H.No: 13-6-460/19, Mahesh Nagar, Shivbagh, Near Gudimalkapur, Vegetable Market, Hyderabad, Telangana- 500028.
Cell No:9849157351.

## త్వరగా దేవాలయం షెడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలి

**-కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి**



శ్రీ దుర్గ రాజరాజేశ్వరి ఆలయం షెడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్ పేట, నవంబర్ 11, ప్రభాతవార్త:**
శ్రీ దుర్గా రాజరాజేశ్వరి దేవాలయం షెడ్డు నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ముసారాంబాగ్ లోని శ్రీ దుర్గా రాజరాజేశ్వరి దేవాలయం ఆవరణలో రూ. 5 లక్షలతో నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణం పనులను జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాలయంలో జరిగే అన్న ప్రసాదం, ఇతర కార్యక్రమాల నిర్వహణ కోసం షెడ్డు నిర్మాణం ఎంతో పడుతుందని తెలిపారు. షెడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత వీధి దీపాలను కిందికి మార్చాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడం కోసం ముసారాంబాగ్ డివిజన్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఇ శరత్ రెడ్డి, వర్క్ ఇన్ స్పెక్టర్ సత్తిరెడ్డి, సిబ్బంది దుర్గారావు, సురేష్, ఆలయ కమిటీ సభ్యులు జంగారెడ్డి, కృష్ణా గౌడ్ ,విశాల్, నాయకులు దినేష్, ఉమేష్, సురేష్ పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107వ వ్యవస్థాపక సంవత్సరోత్సవం



**తుర్కయంజాల్ నవంబర్ 11,ప్రభాతవార్త**
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తుర్కయంజాల్ మున్సి పాలిటీ బ్రాంచ్‌లో యూనియన్ ఆఫ్ ఇండియా 107వ వ్యవస్థాపక సంవత్సరాని జరుపుకోవడానికి ముఖ్య అతిథిగా మాజీ కౌన్సిలర్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోసికె ఐలయ్య మరియు రిటైర్డ్ డిజిఎం రంగారావు, ఇండస్ట్రీస్ యజమాని గిరీషా, ఏ. భూపాల్ రెడ్డి, మోహన్, బ్రాంచ్ సిబ్బందితో కలిసి కొవ్వొత్తి వెలిగించి కేక్ కట్ చేయడం జరిగింది. వారు మంగళవారం మాట్లాడుతూ... యూనియన్ బ్యాంకు 107వ వ్యవస్థాపక సంవత్సరాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా, తుర్కయంజల్ మున్సిపాలిటీ బ్రాంచ్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ ఉత్సవం బ్యాంకు యొక్క దీర్ఘకాలిక వారసత్వాన్ని, వినియోగదారులకు అందించిన సేవలను మరియు స్థానిక సమాజంతో బంధాన్ని గుర్తుచేసే సందర్భంగా మారింది.( బ్రాంచ్ మేనేజర్)పి. జయప్రకాష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నడిపించారు మరియు బ్యాంకు సేవల గురించి ప్రసంగించారు. తుర్కయంజల్ బ్రాంచ్ లోని సిబ్బంది సభ్యులు భాగస్వాములుగా పాల్గొని, బ్యాంకు యొక్క 107 సంవత్సరాల చరిత్రను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు .

## అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి

**: ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారి**



మలక్ పేటలో వాహనాలను తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారి తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 11, ప్రభాతవార్త:**
అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన పేలుడు సంఘటన నేపథ్యంలో సోమవారం రాత్రి చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో మలక్ పేట ,అక్బర్ బాగ్ తదితర ప్రాంతాలలో విస్తృత స్థాయిలో వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలను కాపాడడానికి, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన ముందస్తు భద్రత చర్యలను చేపట్టడం జరిగిందని వివరించారు. చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు ముమ్మరంగా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా వివిధ ప్రాంతాలలో పోలీసు పికెట్లను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సురేష్ రెడ్డి, ఎలా కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో రావినారాయణ కాలనీ విద్యార్థుల ప్రదర్శన



ప్రదర్శనకు వెళ్లిన విద్యార్థులు

**హయత్ నగర్, నవంబర్ 11 ప్రభాతవార్త :**
బాలల దినోత్సవాన్ని పురస్క రించుకుని తెలంగాణ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేస్ 2 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రవీంద్ర భారతి ఆడిటోరియంలో నాటిక ప్రదర్శన నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు డ్రాయింగ్, డ్రాన్స్ పోటీల్లో బహుమ తులు గెలుచుకున్నారు. విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను, ప్రతిభను, కళలను ప్రజానాట్య మండలి ప్రోత్సహించి మరింత ముందుకు తీసుకుపోయే విధంగా కృషి చేస్తుందని సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వేణుగోపాల చారి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిత, జ్ఞాన సుందరి,విజేందర్,సింధు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఇందిరమ్మ క్యాంటీన్ ఎంతో ప్రయోజనం : లచ్చిరెడ్డి



ఇందిరమ్మ క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం నవంబర్11,ప్రభాతవార్త**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్‌జిఓఎస్ కాలనీ స్వామి వివేకనంద పార్కు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటీన్ ను స్థానిక బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ ఇందిరమ్మ క్యాంటీన్ లలో లబ్ధిదారులకు సబ్సిడీతో ఉదయం 7:00 గంటల నుంచి 9:30 గంటల వరకు రూ.5కే అల్పాహారం, మధ్యాహ్నం 12:00 గంటల నుంచి 2:30 గంటల వరకు రూ.5 కే భోజనం అందించబడుతుందని.జీహెచ్ఎంసీ ఒక్కో అల్పాహారం పై రూ.14, భోజనంపై రూ.24.83 ఖర్చు చేస్తుందని.వీటి నిర్వాహణ బాధ్యతను హరే కృష్ణ హరే రామ ఫౌండేషన్ వారు చూస్తారని. ఇందిరమ్మ క్యాంటీన్ ల ద్వారా ఉదయం అందించే అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో డివిజన్లోని పేదలు, అడ్డా కూలీలు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారులు, అల్పదాయ వర్గాల వారు మరియు నిరుద్యోగులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి శానిటేషన్ విభాగం డిఈ నీలిమ, శీశీ అజీమ్ ఉద్దీన్ మరియు పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి,పవన్ రెడ్డి, నాయకులు సుధీర్ కుమార్, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ మరియు ఎస్ఎఫ్ఎ మై రాజ్ మరియు తదితరులు ఉన్నారు.

## స్టార్మ్ వాటర్ పైప్‌లైన్ పనులపై అసంతృప్తి



పనులను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, నవంబర్ 11 ప్రభాతవార్త:**
కొత్తపేట డివిజన్‌లోని ఎస్.ఆర్.ఎల్ కాలనీలో ముంపు సమస్యలను పరిష్కరించేందుకు సుమారు రూ.5కోట్ల నిధులతో చేపట్టిన స్టార్మ్‌వాటర్ పైప్‌లైన్ పనులు గత మూడు రోజులుగా సక్రమంగా సాగడం లేదని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్లోని ఎస్ఆర్ఎల్ కాలనీలో నత్తనడకన జరుగుతున్న స్టార్మ్‌వాటర్ పైప్‌లైన్ పనులను మంగళవారం కార్పొరేటర్ పరిశీలించారు. పనుల నిర్వహణలో అధికారులు అలసత్వం వహించడం పట్ల కార్పొరేటర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అదికారులు, సంబంధిత కాంట్రాక్టర్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ అధికారులు వెంటనే హాజరై రోజువారీగా పనులను వేగవంతంగా నిర్వహించాలని సూచించారు.స్టార్మ్‌వాటర్ డ్రైనేజ్ పనులు పూర్తి కాకపోతే, వర్షాకాలంలో కాలనీ వాసులు మరోసారి నీటి నిల్వలతో ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందని, అందువల్ల ఎక్కడా నిర్లక్ష్యం సహించబోమని కార్పొరేటర్ హెచ్చరించారు.ప్రజల సమస్యల పరిష్కారం అత్యంత ప్రాధాన్యం కాబట్టి, పనుల నిర్వహణలో నాణ్యతకు భంగం లేకుండా, వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ షరీఫ్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, బిజెపి నాయకులు కొత్త తిరుమల్, గట్టు మహేష్‌కుమార్, తోట మహేందర్‌యాదవ్, శరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అబుల్‌కలాం జయంతి వేడుకలు



ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

**ఉప్పల్, నవంబరు 11 ప్రభాతవార్త :** స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలువురు అధ్యాపకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం, తెలంగాణ మైనార్టీ సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ కలాం దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలు అందించారని కొనియాడారు. నవభారత విద్యా దార్శనికుడిగా ఆయన స్వతంత్ర పోరాటం చేశారని పేర్కొన్నారు. అధునిక సాంకేతిక విద్య, వయోజక విద్యాభావనలకు అంకురార్పణ చేశారని తెలిపారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు పి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్య అనేది భవిష్యత్ తరాలకు సంభావ్యంగా ఆదర్శ ప్రపంచాన్ని రూపొందించగల ప్రాథమిక మానవ హక్కు అన్నారు. ఎన్ఎస్ఎస్ పిఓ జల్దా విశ్వనాద్ మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. ఒత్తిడి లేని, విలువలు కూడిన విద్య అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాకవి డా.అందెశ్రీకి కళాశాల బృందం నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.ఎ.రవిప్రసాద్, అధ్యాపకులు డా.సిహెచ్ సత్యానారాయణ, డా.ఎన్ రాజశ్రీ, డా.జి.తిరుపతయ్య, కె.గీత, డా.ఎస్ యమునా రాణి, డా.వి.శ్రీనివాసరావు, డా.ఆర్ చంద్రసాగర్, డా.పి.వెంకటేశ్వర్లు, స్రవంతి, విజయలక్ష్మి, అనూష పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలో ఆరు పథకాలు



పథకాలతో డీఎస్‌జీఎస్ స్కూల్ విద్యార్థులు

**నాచారం, నవంబర్ 11 ప్రభాతవార్త :**
కాంటినెంటల్ షోటోకాన్ కరాటే దో ఇండియా (సీఎస్‌కేఐ) నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 10వ సీఎస్‌కేఐకప్ 2025 పోటీల్లో నాచారం దక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఏకంగా ఆరు పథకాలు సాధించి తమ ప్రతిభను చాటారు. కరీంనగర్ లో ని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో నవంబర్ 7 నుండి 9 వరకు జరిగిన ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనను దక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు కనబరిచారు. నైపుణ్యం, క్రమశిక్షణ యొక్క అద్భుతమైన ప్రదర్శనలో డీఎస్‌జీఎస్ విద్యార్థులు మొత్తం ఆరు పతకాలను సాధించి, సంస్థకు గర్వకారణంగా నిలిచారు.రెండు బంగారు పథకాలు, రెండు వెండి,2 కాంస్య పథకాలు సాధించారు. ఛాంపియన్ షిప్ డిఎస్‌జిఎస్ విద్యార్థులు వారి అంకితభావం, పనితీరుతో ప్రత్యేకంగా నిలిచారని చైర్మన్ కె. నవనీతరావు, ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యువ విజేతలకు, వారి గర్వించదగిన తల్లిదండ్రులకు కరాటే కోచ్ నల్ల శివ ప్రసాద్ కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.వారి మార్గదర్శకత్వం, శిక్షణ ఈ విజయంలో కీలక పాత్ర పోషించింది. ఈవిజయం డిఎస్‌జిఎస్ విద్యార్థుల క్రీడా నైపుణ్యాన్ని హైలైట్ చేయడమే కాకుండా, ప్రతిభను పెంపొందించడం, క్రమశిక్షణ, పట్టుదల, జట్టుకృషి యొక్క విలువలను పెంపొందించడంలో పాఠశాల యొక్క నిబద్ధతను కూడా ప్రతిబింబిస్తుందన్నారు.

## ఆటో డ్రైవర్లకు ఆటోల అందజేత



లబ్ధిదారుడైన ఆటో డ్రైవర్‌కు తాళం చెవిని అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

**నాచారం, నవంబర్ 11 ప్రభాతవార్త :**
లబ్ధిదారులకు ఆటోలను అందజేసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఉప్పల్ నియోజకవర్గం లోని ఆటో డ్రై డ్రైవర్ లు అయిన 50 మందికీ ప్రభుత్వ స్కీం జీవో నంబర్ 263 కింద మంజూరైనా కొత్త ఆటోలను ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆటో డ్రైవర్లకు రిబ్బన్ కట్ చేసి డ్రైవర్లకు అందించారు. ఈకార్యక్రమం బీఆర్టీయూ కార్మిక అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన జరిగింది. కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి,హమాలీ శ్రీనన్న, బిఆర్‌టియూ రాష్ట్ర కార్యదర్శి మహేష్. దేశపాక్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాండు నాయక్, సిహె చ్ సాయి కుమార్, సిహెచ్ శ్రీనివాస్ యాదవ్,శ్రీరామ్ నాయక్, ఎర్రం శ్రీనివాస్, గోపాల్ వేముల మారయ్య తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ రైతు బజార్, వీధి వ్యాపారుల దుకాణాల సముదాయాల పరిశీలన



నిరుపయోగం ఉన్న మీర్‌పేట్ మంత్రాల చెరువు వద్ద నిర్మించిన వీధి వ్యాపారుల దుకాణాల సముదాయాన్ని పరిశీలిస్తున్న కమీషనర్ నాగమణి

**సరూర్‌నగర్, నవంబర్ 11 ప్రభాతవార్త:**
మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిరుపయోగంగా ఉన్న లెనిన్‌నగర్ రైతు బజార్ షాపులను, మీర్‌పేట్ మంత్రాల చెరువులోని వీధి వ్యాపారుల దుకాణాల సముదాయాన్ని మంగళవారం కమీషనర్ నాగమణి పరిశీలించారు. గత బిఆర్ఎస్ పాలనలో నాటి మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో పేద, చిరు వ్యాపారుల సంక్షేమం కోసం వాటిని నిర్మించారు. అయితే నిర్మాణం జరిగి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు వాటిని ఎవరికీ కేటాయించలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం కమీషనర్ నాగమణి అసిస్టెంట్ కమీషనర్ సంరెడ్డి నాగేందర్‌రెడ్డి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ నర్సింహ తదితరులతో కలిసి వాటిని పరిశీలించారు. ఈ మేరకు వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలనే దానిపై సమీక్షించారు. అనంతరం కుర్మల్‌గూడలోని డిఆర్‌సి, డంపింగ్ యార్డును కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ద్వారా చేయాల్సిన పనులు పూర్తి చేయాలని కమీషనర్ సానిటరీ ఇన్స్‌పెక్టర్‌ను ఆదేశించారు.

## మలక్ పేటలో భారీ పోలీస్ పెట్రోలింగ్




దిల్ షుక్ నగర్ లోని ఓ హోటల్ లో డాగ్ స్క్వాడ్ తో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపి సుబ్బరామిరెడ్డి, ఎస్ ఐ సంజీవరెడ్డి తదితరులు

**మలక్ పేట, నవంబర్ 11, ప్రభాతవార్త:**
మలక్ పేట్‌లో భారీ పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు మలక్ పేట ఏసిపి సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడు సంఘటనలతో ముందస్తు భద్రత చర్యలలో భాగంగా మలక్ పేట డివిజన్ ఏసిపి సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో మలక్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దిల్ షుక్ నగర్, గడ్డి అన్నారం తదితర ప్రాంతాల్లోని హోటల్లు, వ్యాపార సముదాయాలలోతనిఖీలు నిర్వహించడంతోపాటు వాహనాలను తనిఖీ చేశారు అదేవిధంగా దిల్ షుక్ నగర్ బస్టాండ్ లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ సిటీ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు వదంతులు, పుకార్లు నమ్మవద్దని సూచించారు. అనుమానాస్పద వస్తువులు, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఐ ఉదయ శంకర్, ఎస్ఐ సంజీవరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపు రంగారెడ్డి జిల్లా జూనియర్ బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక

**హుడాకాంప్లెక్, నవంబర్ 11, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల, బాలికల రంగారెడ్డి జిల్లా జట్టు ఎంపిక రేపు (13వ తేది, గురువారం) సరూర్ నగర్ లోని ఇండోర్ స్టేడియం లో నిర్వహించబడునని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికుమార్, ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ రెడ్డి లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపిక అయిన క్రీడాకారులు తేదీ: 05 12-2025నుండి 07122025 వరకు ఇండోర్ స్టేడియం మహబూబ్ నగర్ జిల్లా నందు నిర్వహించబడు 51వ జూనియర్ అంతర్ జిల్లా కబడ్డీ పోటీలలో రంగారెడ్డి జిల్లా తరుపున పాల్గొంటారని తెలిపారు. ఇట్టి రంగారెడ్డి జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక పోటీలలో పాల్గొనాల్సిందిగా వారు కోరారు. 1801 2006 తరువాత పుట్టి, బరువు 75కేజీ ల లోపు ఉన్న బాలురు, 29.12.2025 తరువాత పుట్టి బరువు 65 కేజీ ల లోపు ఉన్న బాలికలు పోటీల్లో పాల్గొనటానికి అర్హులు. పోటీల్లో పాల్గొనే వారు ఆధార్ కార్డు తీసికురాగలరని తెలిపారు. ఇతర వివరాలకు చంద్రమోహన్ 7661992581, రాజు, 90000 38272 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## వైదేహినగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

**వనస్థలిపురం. నవంబర్.11.ప్రభాతవార్త**
వైదేహినగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పొగుల రాంబాబు,బి.రాజేందర్ రెడ్డి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైదేహినగర్ నార్త్ కాలనీలో జరిగిన కాలనీ సర్వసభ్యసమావేశంలో కాలనీవాసులు పాల్గొని ఎన్నికల అధికారుల సమక్షంలో రాంబాబు,రాజేందర్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కోశాధికారి అసోసియేషన్ కు సంభవించిన జమ,ఖర్చులను సభ్యులకు వివరించడంతో ,ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ సమావేశంలో కాలనీకి సంభదించిన వివిధ విభాగాల కు చెందిన అధికారులను,పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడారు. అనంతరం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రాంబాబు,రాజేందర్ రెడ్డి లు మాట్లాడుతూ కాలనీలో మిగిలిన అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధికి సహకరించే వివిధ విభాగాల అధికారులను, పారిశుధ్య కార్మికులను సత్కరించి,తగిన ప్రోత్సాహకాలు ఇవ్వడం జరిగింది. చెత్తను చేరవేసే రిక్షా కార్మికులకు వచ్చే డిసెంబరు నుండి నెలకు 150 రూపాయలు ఇచ్చేలా ప్రతి ఇంటికి తెలిజేస్తామన్నారు.కాలనీవాసుల కు ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

## శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో కార్యశాల



ఉప్పల్ సరస్వతి శిశు మందిర్‌లో జరిగిన కార్యశాల కార్యక్రమంలో పాల్గొన్న పుర ప్రముఖులు

**ఉప్పల్, నవంబరు 11 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మహిళ ఆచార్యునుల కార్య శాల నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్థానిక పుర ప్రముఖులు గోనె ప్రభాకర్‌రెడ్డి, ఉప్పల్ పాఠశాల అధ్యక్షులు అంకన్నగారి మాధవరెడ్డి, సలహా సభ్యులు మందుముల అంజిరెడ్డి,కార్యదర్శి మార్తా అనిల్ తదితరులు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమారోప్ కార్యమ్రకంలో గుజ్జుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఆచార్యుడు సమాజ శిల్పి అని, నిరంతరం నేర్చుకుంటేనే విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించగలుగుతారని పేర్కొన్నారు, పాఠశాల కోశాధికారి ఉప్పోజి బలవంతచారి మాట్లాడుతూ క్రమశిక్షణ, మంచి ప్రవర్తన శిశు మందిర్ పాఠశాలలతోనే అందుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, అచార్యునులు పాల్గొన్నారు.

## అందెశ్రీకి అంతిమ వీడ్కోలు




అందెశ్రీ అంతిమయాత్రలో పాల్గొన్న మేడ్చల్ ఇన్చార్జ్ తోటకూర వజ్రేశ్ యాదవ్ , తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, తదితరులు

**బోడుప్పల్ , నవంబర్ 11 ప్రభాతవార్త ;**
ఘట్కేసర్ లో ప్రముఖ కవి, వాగ్గేయకారుడు కీ. శే అందెశ్రీ పార్థివదేహానికి ప్రభుత్వ లాంచనలతో జరిపిన అంత్యక్రియ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు , రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు, వారితో పాటు అంతిమ యాత్రలో పాల్గొని నివాళులు అర్పించిన మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ , మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , బోడుప్పల్ పట్టణ అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి ,మేడ్చల్ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ , మాజీ కార్పొరేటర్లు కుంభం కిరణ్ కుమార్ రెడ్డి , భూక్య సుమన్ నాయక్ , సీనియర్ నాయకులుపులకండ్ల జంగారెడ్డి, పాల్గొన్నారు.

## చెరువుల సంరక్షణ కోసం కృషి:చింతల



పనులను పరిశీలిస్తున్న అరుణాసురేందర్‌యాదవ్

**ఎల్.బి.నగర్, నవంబర్ 11 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ పరిధిలో చెరువుల సంరక్షణ. శుభ్రత కోసం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించడం జరిగిందని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని నాగోలు చెరువు, ఫతులగూడ చెరువులలో చెరువుల శుభ్రత, సంరక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా చెరువుల ప్రాంతాలను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువుల్లో పేరుకున్న గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు తొలగించడం, చెరువుల చుట్టూ ఉన్న తుమ్మ మొక్కలు తొలగించడం, అలాగే దోమల నివారణ చర్యలు చేపట్టడం కోసం రూ.3.6 లక్షల వ్యయం కేటాయించడం జరిగిందన్నారు.చెరువుల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలు, చెరువు అందాలను కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. చెరువులు పరిశుభ్రంగా ఉంటే పరిసరాలు కూడా ఆరోగ్యవంతంగా ఉంటాయి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌సి మాధవరెడ్డి, ఏఈ రవీందర్‌రెడ్డి, సూపర్వైజర్ జనార్ధన్, అధికారులు, సిబ్బంది, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఆన్లైన్ భద్రతపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 11 ప్రభాతవార్త:** ఇటీవల కాలంలో జరుగుతున్న ఆన్లైన్ మోసాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య, చైతన్యపురి ఇన్స్పెక్టర్ కే.సైదులు పేర్కొన్నారు. చైతన్యపురి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్‌క్రైమ్ అవగాహనా సమావేశం సోమవారం రాత్రి చైతన్యపురిలో నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సైబర్ మోసాలు, ఫేక్‌ఖాతాలు, ఆన్‌లైన్ భద్రతపై జాగ్రత్తలు తీసుకోవడాన్ని వివరించారు. సందేహాస్పద లింకులు, మెసేజెస్‌ను క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి వివరించరాదని, పాస్వర్డ్‌ను సురక్షితంగా ఉంచాలని, సోషల్ మీడియా అకౌంట్లను గోప్యతా సెట్టింగ్స్‌తో వాడాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద చర్యలు కనబడితే వెంటనే పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. అలాగే పోలీస్ 100 ఆంక్షల సేవలను విలీనం చేసి అన్ని అత్యవసర సేవలకి 112 నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, అత్యవసర పరిస్థితుల్లో 112కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాల పెరుగుదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరంఉందన్నారు.

## మారుతున్న కాలానికి అనుగుణంగా లార్డ్స్‌లో విద్యాభ్యాసం : సిద్దాల బీరప్ప, బెర్లు శ్రీనివాస్‌రెడ్డి




క్రీడో ద్వారా విద్యాభ్యాసం చేసి ఉపాధ్యాయుల సమక్షంలో ప్రదర్శిస్తున్న లార్డ్స్ విద్యార్థులు

**సరూర్‌నగర్, నవంబర్ 11 ప్రభాతవార్త:** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా బోధన చేయడానికి లార్డ్స్ విద్యా సంస్థలు ప్రాధాన్యతనిస్తున్నాయని ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డిలు స్పష్టం చేశారు. బడంగ్‌పేట్‌లోని లార్డ్స్ పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మంగళవారం క్రీడో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల కలలను సాకారం చేసే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి క్రీడో పేరిట చక్కని విద్యాభ్యాస కార్యక్రమాలకు లార్డ్స్ విద్యా సంస్థల్లో శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. వినూత్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని వారు వెల్లడించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకుపోతున్నామని బీరప్ప, శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, బడంగ్‌పేట్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, ఇంఛార్జి రేఖా సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అందెశ్రీ చిత్రపటానికి సిపిఐ నేతల ఘన నివాళి




ప్రజాకవి అందెశ్రీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సిపిఐ నేతలు వి.ఎస్.బోస్, ధర్మేంద్ర తదితరులు

**ఉప్పల్, నవంబరు 11 ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్ర కవి,ఉద్యమకారుడు, సాహితీవేత్త అందెశ్రీ మరణం తెలంగాణకు తీరని లోటని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్.బోస్ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాకవి అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో విఎస్ బోస్ మాట్లాడుతూ అందెశ్రీ ఆకస్మిక మరణం తీవ్రంగా కలచివేసిందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి ఎన్నో గేయాలు రచించారని తెలిపారు. అందెశ్రీ అకాల మరణంతో అంతా దు:ఖ సాగరంలో మునిగిపోయారన్నారు. తెలంగాణ సాహితీ లోకంలో ఒక మహానుభావుడిని, ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన కవిని కోల్పోయామని అన్నారు. జయ జయహే తెలంగాణ పాట ద్వారా తెలంగాణ చరిత్ర, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని బలోపేతం చేసిన అందెశ్రీ సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధర్మేంద్ర, నేతలు నర్సింహా రావు, సత్యనారాయణ, మహేష్, అక్బర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.